


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 139 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 31 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 139 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 31 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు

# అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్




- మిగతా2లో

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు

# చూడవు, రికార్డు చేయవు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:**వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో

## తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా..

# 10 బిల్లులకు ఆమోదం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడింది. 2026, మార్చి 16న మొదలైన అసెంబ్లీ బడ్జెట్ సెషన్? సోమవారం (మార్చి 30)తో ముగిసింది. మొత్తం 10 రోజుల పాటు సభ నడవగా అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు సోమవారం (మార్చి 30) స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఈ సెషన్‌లో అసెంబ్లీ మొత్తం 82 గంటల 47 నిమిషాల పాటు పని చేసింది. గిగ్ వర్కర్స్ బిల్లు, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

- మిగతా2లో

## గడ్డి మందు పారాక్వాట్ నిషేధించాలి..

# అసెంబ్లీలో మంత్రి తుమ్మల తీర్మానం




**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ 24% ఎస్ఎల్ అనే ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ తీర్మానం

- మిగతా2లో

## మంత్రి పొంగులేటిని

# బర్తరఫ్ చేయండి

### గవర్నర్ ను కోరిన బీఆర్ఎస్ నేతలు



- మంత్రి పొంగులేటిపై అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్
- అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై విచారణ జరపాలని డిమాండ్
- కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం
- సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరిన బీఆర్ఎస్
- పొంగులేటితో పాటు ఇతర స్కామ్‌లపైనా విచారణకు సీఎం సిద్ధమా అని కేటీఆర్ సవాల్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలు ఉన్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను

- మిగతా2లో




## లక్ష కోట్ల ప్రజాధనం

# వృథా

### కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్యలు

- కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని వెల్లడి
- ప్రాజెక్టు వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలు కారణమని వెల్లడి
- జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టుపై రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, లక్ష కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని అన్నారు.

- మిగతా2లో

- హరీశ్ రావు కాలనాగు కన్నా ప్రమాదకరం
- కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు వచ్చింది
- రావణుడు లేకుంటే రాముడికి గుర్తింపు లేదు
- శకుని లేకుంటే కృష్ణుడికి గుర్తింపు వచ్చేదా
- అట్లనే కేసీఆర్ లేకుంటే నాకు ఐడెంటిటీ లేదు
- 2 రోజులు కేరళంలో ప్రచారం చేస్తా : సీఎం రేవంత్

## గృహ నిర్బంధంలో

# కేసీఆర్

### కేటీఆర్, హరీశ్ రావే చేసిండ్రు



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ సీఎం కేసీఆర్ గృహ నిర్బంధం లో ఉన్నట్టు తనకు అనుమానంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, హరీశ్ రావే ఆయనను నిర్బంధించారని ఆరోపించారు. ఇవాళ ఆయన అసెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు కాలనాగు కన్నా ప్రమాదకరమని సీఎం అన్నారు. కేసీఆర్ తో తనకు పోలిక లేదని అన్నారు. కేసీఆర్ వరి వేస్తే ఉరే అని అన్నారని, తాను మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నానని చమత్కరించా రు. తనకు కేసీఆర్ వల్లే గుర్తింపు వచ్చిందని చెప్పారు. రావణుడు లేకుండా రాముడికి గుర్తింపు లేదని, అదే విధంగా శకుని లేకుంటే కృష్ణుడికి గుర్తింపు లేదని చెప్పారు.అట్లనే కేసీఆర్ లేకుంటే రేవంత్ రెడ్డికి కూడా గుర్తింపు లేదని చెప్పుకొచ్చారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. కాకపోతే అది అంతగా

- మిగతా2లో

## 'హేట్ స్పీచ్' బిల్లు ప్రజాస్వామ్య

# గొంతును నొక్కేందుకే




- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'హేట్ స్పీచ్' బిల్లుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే ఈ చట్టం తెస్తున్నారని ఆరోపణ
- బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా, దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తాయన్న కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే జైలుకు పంపే ప్రమాదం ఉందని హెచ్చరిక
- బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

- మిగతా2లో

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది:

# కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న



- మిగతా2లో

## హర్మూజ్ తెరవకపోతే

# ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు



- మిగతా2లో

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..

# రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



**పెన్ పవర్ డెస్క్:**విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో




## నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి. ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు. ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభా పురస్కారం, బూర్గుల రామకృష్ణా రావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహ శాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందారు. వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.

## లక్ష కోట్ల ప్రజాధనం వృథా

- మొదటి పేజి తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలు కారణమని అన్నారు.కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఇంకా మాట్లాడుతూ, జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళుగా ఒక్క ప్రతిపాదన పంపించలేదని అన్నారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ.873 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఉన్నప్పటికీ రూ.194 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని విమర్శించారు.

# ‘హేట్ స్పీచ్’ బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ‘తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు’పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక ‘క్రూరమైన ఆయుధం’ అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. “ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది” అని ఆయన పేర్కొన్నారు.

బిల్లులో పొందుపరిచిన ‘వ్యతిరేక భావాలు ప్రేరేపించడం’, ‘సామాజిక సమగ్రతను దెబ్బతీయడం’ వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు. ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు.

ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని ‘ఫేక్ న్యూస్’గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. “ఇప్పటికే తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ కొత్త చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటి?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- మొదటి పేజి తరువాయి

కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో సైతం మైనింగ్ చేస్తోందని, దీనికి సంబంధించి కనీస అనుమతులు కూడా తీసుకోలేదని పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో వివరించింది. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారే తప్ప ప్రభుత్వం స్పందించలేదని నేతలు అన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు.గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున

సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు.అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే పొంగులేటి వ్యవహారంతో పాటు అమృత్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన విమర్శించారు.

# గృహ నిర్బంధంలో కేసీఆర్

- మొదటి పేజి తరువాయి

ప్ర జల్లోకి వెళ్లలేదని అన్నారు. ఆ తరువాత ఎన్టీరా మారావు ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లగా అది ప్రజల్లోకి వెళ్లిందన్నారు. రేషన్ బియ్యం పంపిణీపై మంచి స్పందన వచ్చిందని, నలభై ఏండ్లుగా ఈ పథకం కొనసాగుతోందని అన్నారు. ఇప్పుడు దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప.. పేదలకు ఉపయోగ పడటం లేదని గ్రహించామని సీఎం అన్నారు. అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలో 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ది

పొందుతున్నారన్నారు. భవిష్యత్ లో ఇది 90 శాతం కూడా కావచ్చని చెప్పారు. అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు అందించామని సీఎం చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌ ష్టికాహారం అందించడమే తమ నెక్స్ టార్గెట్ అని సీఎం చెప్పారు. అలాగే రాష్ట్రంలో ఆహార కల్తీని నివారిస్తామని చెప్పారు. ఇందుకోసం ఈగల్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అన్నారు.

**లక్ష్మణ్ ఎంపీ పదవికి రాజీనామా చేయాలె**

నియోజక వర్గాల పునర్విభజన పైన బీజేపీ లక్ష్మణ్ ఏదో మాట్లాడుతున్నారని సీఎం అన్నారు. తెలంగాణ లోనే రాష్ట్రపతి పాలన పెడతామని లక్ష్మణ్ అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అని సీఎం ప్రశ్నించారు. నియోజక వర్గాల పునర్విభజన ను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే సౌత్ కు అన్యాయం జరుగుతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వితండవాదం చేస్తున్నారని అన్నారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారత దేశానికి నేరుగా లాభం జరుగుతుందని సీఎం అన్నారు. రాజకీయం గా అవసరం ఉన్నపుడే సౌత్ ఇండియా ను పట్టించు కావడం లేదని, నియోజక వర్గాల పునర్విజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని అన్నారు. ఇది పార్టీల సమస్య కాదు సౌత్ ఇండియా మొత్తానికి సంబంధించిన సమస్య అని చెప్పారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని సీఎం డిమాండ్ చేశారు. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని అన్నారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం మొదలవుతుందని అన్నారు. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తాను రేపటి నుంచి కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నట్టు సీఎం చెప్పారు. సుపరిపాలనపైనే దృష్టి సారించామని సీఎం చెప్పారు.

# గడ్డి మందు పారాక్వాట్ నిషేధించాలి..
# అసెంబ్లీలో మంత్రి తుమ్మల తీర్మానం

- మొదటి పేజి తరువాయి

చేసిందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతున్నదని ఆయన పేర్కొన్నారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాలలో పారాక్వాట్?పై నిషేధం లేదా కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని

అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. పారాక్వాట్?కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డిమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి విజజప్తి చేశారు. ఈ తీర్మానం ద్వారా రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..
# రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన “ఉడాన్ యాత్రి కేఫ్”ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం ‘ఫ్లైబ్రరీ’, పిల్లల కోసం ప్రత్యేకంగా ‘కిడ్స్ జోన్’ వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ‘అవ్సార్’ (ూాఒూాా=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

**అందుబాటు ధరలు.. స్థానిక రుచులు**

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

## తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా..
# 10 బిల్లులకు ఆమోదం

- మొదటి పేజి తరువాయి

వంటి 10 ముఖ్యమైన బిల్లులకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. హేట్ స్పీచ్ బిల్లును ప్రభుత్వం సెలక్ట్ కమిటీకి సిఫార్సు చేసింది. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ప్రజా సమస్యలు, బడ్జెట్ కేటాయింపులపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడీగా చర్చ నడిచింది.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) – కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, ‘ఎల్డీఎఫ్–బీజేపీ’ కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం ‘కార్పొరేట్ నిధుల ప్రభుత్వం’గా మారిందని విమర్శించారు.

## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు.

తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.


## హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హర్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

**ఇరాన్ నాయకులు ఖండించారు.**

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.




# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

- అక్రమ నిర్మాణం కూల్చివేతల్లో అధికారుల తీరుపై అనుమానాలు..?
- బహుదూర్‌పల్లి 1500 గజాల అక్రమ షెడ్డు కూల్చివేతలో చేతివాటం..?
- షెడ్డుపై రెండు రేకులు తొలగించి నివేదికల కోసం "చర్యలు" మమః..



అదే నిర్మాణంలో బ్రేకర్లు-, గ్యాస్ కట్టర్లతో టౌన్‌ప్లానింగ్ చర్యలు..



గత 26వ తేదీన టౌన్‌ప్లానింగ్ కూల్చిన ఫొటో..

# కప్పం కడితే..! కూల్చింది కట్టుకోవచ్చు..!



గండిమైసమ్మ తాజా హోటల్ పక్కన కూల్చివేతలు జరిపిన అక్రమ నిర్మాణం.. మళ్ళీ నిర్మాణం..

## కూల్చేసిన 4 రోజులకే మళ్ళీ నిర్మాణం..

- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో అక్రమ కట్టడాల దందా మరోసారి బహిర్గతం..!
- కూల్చివేతలే నాటకమని నిరూపణ..? దుండిగల్ ఏసిపి-టిపిఎస్ మౌనం..
- భారీగా చేతులు మారినట్టు ఆరోపణలకు.. ఈ నిర్మాణమే నిదర్శనం..
- డిప్యూటీ కమిషనర్ అసలు ఉన్నారా..? బదిలీపై వెళ్ళారా..? అనుమానాలు వ్యక్తం.
- "తిలాపాపం తలాపిడికెడు" సెటిల్మెంట్‌లే లక్ష్యంగా చర్యలకు దూరం..
- 14 మంది గ్రూప్-4 అధికారులు ఖాళీగా ఉన్నప్పటికీ..
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని చైన్‌మెన్‌లుగా నియామకం..!లి
- దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న వైనాన్ని తలపిస్తుందని విమర్శలు..?
- కరెప్షన్ కోసమే కార్యాలయాలు..? విధుల్లో ఆరితేరిన అధికార యంత్రాంగం..!
- స్పందించని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఒక ఐఏఎస్..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తెలంగాణలో ఈగల్, హైడ్రా తరహాలో మరో సరికొత్త వ్యవస్థ... రేవంత్ రెడ్డి ప్రకటన

- ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామన్న ముఖ్యమంత్రి
- దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడి
- రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తెచ్చామన్న సీఎం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా, ఈగల్ తరహాలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.



## న్యాయవాదుల రక్షణ కోసం ప్రొటెక్షన్ బిల్లు

అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తామన్న మంత్రి
న్యాయవాది వామనరావుదంపతుల హత్యను ప్రస్తావించిన మంత్రి
బీఆర్ఎస్ నాయకుల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురయ్యారని ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.పట్టపగలు నడిరోడ్డుపై వారు హత్యకు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోద్భలంతోనే వారిని హత్య చేశారని ఆరోపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకువస్తున్నట్లు చెప్పారు.



# కప్పం కడితే..! కూల్చింది కట్టుకోవచ్చు..!

- అక్రమ నిర్మాణం కూల్చివేతల్లో అధికారుల తీరుపై అనుమానాలు..?
- బహుదూర్‌పల్లి 1500 గజాల అక్రమ షెడ్డు కూల్చివేతలో చేతివాటం..?
- షెడ్డుపై రెండు రేకులు తొలగించి నివేదికల కోసం "చర్యలు" మమః..

## కూల్చేసిన 4 రోజులకే మళ్ళీ నిర్మాణం..

- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో అక్రమ కట్టడాల దందా మరోసారి బహిర్గతం..!
- కూల్చివేతలే నాటకమని నిరూపణ..? దుండిగల్ ఏసిపి-టిపిఎస్ మౌనం..
- భారీగా చేతులు మారినట్టు ఆరోపణలకు.. ఈ నిర్మాణమే నిదర్శనం..
- డిప్యూటీ కమిషనర్ అసలు ఉన్నారా..? బదిలీపై వెళ్ళారా..? అనుమానాలు వ్యక్తం.
- "తిలాపాపం తలాపిడికెడు" సెటిల్మెంట్‌లే లక్ష్యంగా చర్యలకు దూరం..
- 14 మంది గ్రూప్-4 అధికారులు ఖాళీగా ఉన్నప్పటికీ..
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని చైన్‌మెన్‌లుగా నియామకం..!లి
- దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న వైనాన్ని తలపిస్తుందని విమర్శలు..?
- కరెప్షన్ కోసమే కార్యాలయాలు..? విధుల్లో ఆరితేరిన అధికార యంత్రాంగం..!
- స్పందించని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఒక ఐఏఎస్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 30:

దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామనే ప్రచారం ఒకవైపు కొనసాగుతుండగా, వాస్తవానికి మాత్రం కూల్చివేతలే ఒక నాటకమని, సదరు అక్రమ నిర్మాణాలే అధికారులకు అదనపు ఆదాయమన్ని సమకూర్చుతుందని ఆరోపణలు లేకపోలేదు.. గత గురువారం (మార్చి 26న) నర్సాపూర్ హైవేపై ఉన్న తాజా హెటల్ పక్కన ఉన్న అక్రమ నిర్మాణాన్ని, బహుదూర్‌పల్లిలో 1500 గజాల్లో భారీ అక్రమ షెడ్డుపై కూల్చివేతలు, మరోచోట షట్టర్‌లు కూల్చేశామని చెప్పారు.. అధికారపార్టీ యువ నాయకుడు సిఫార్సులు చేసిన షెడ్డు కూడా కూల్చివేతల డ్రామాతో ఫొటోషూట్ చర్యలపై "పెన్ పవర్" దినపత్రికలో ఆనాడే చెప్పింది.. నేడు అదే నిజమైంది.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారికంగా కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు కేవలం నాలుగు రోజుల్లోనే సోమవారం (మార్చి 30) నాటికి మళ్ళీ నిర్మించటం తీవ్ర చర్చనీయాంశమైంది.. మరోవైపు బహుదూర్‌పల్లి భారీ అక్రమ షెడ్డును, కూల్చేసిన తీరును గమనించండి తెలుస్తుంది.. అధికారుల నిర్లక్ష్యమా..? కళ్లుమూసుకుని ముడుపులతో అనుమతించడమా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

### హైకోర్టు ఆదేశాలు బుట్టదాఖలు..?

హైకోర్టులో విచారణకు వచ్చిన అక్రమ కట్టడాల కేసు వ్యవహారంలో, కోర్టు తీవ్రంగా స్పందించింది.. టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకుండా, సహకరిస్తున్నారని, గతేడాది "2025 మే 2న" హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసి కమిషనర్ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన నిబంధనలతో కూడిన "సర్క్యులర్" జారీ చేసిన సంగతి తెలిసిందే..! అయినప్పటికీ, దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ ఆదేశాలను పూర్తిగా విస్మరించి వ్యవహరిస్తున్న తీరు ప్రశ్నార్థకంగా మారింది.. అక్రమ నిర్మాణాలకు బహిరంగంగానే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, సంబంధిత ఉన్నతాధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌనం వెనుక అసలు కారణం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది.


### ప్రజలను-ప్రశ్నించే వారని మభ్యపెట్టే కూల్చివేతలు..!

"వన్‌షాట్ 'టు' బర్డ్స్" కథ వినే ఉంటారు.. ఇది దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సరిగ్గా సరిపోతుంది.. అటు అక్రమార్కులకు జలక్ ఇచ్చినట్టు ఉంది..! ఇటు పత్రికా కథనాలకు స్పందించినట్టు ఉంది..! ప్రశ్నించే వారికి ఏదో ఒకటి సమాధానం అన్నట్టు.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారి, "అసిస్టెంట్ సిటీ ప్లానర్" వేసిన ప్లాన్ "పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగినట్టు" ఉంది.. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అహంతో..! "టిజి-బిపాస్" చట్టాన్ని సైతం తుంగలో తొక్కుతున్నారు..! నిబంధనలను కాల రాస్తున్నారు..! జీహెచ్ఎంసి కమిషనర్ జారీచేసిన "సర్క్యులర్"ను కూడా బుట్ట దాఖలు చేశారు.. దుండిగల్ పట్టణ ప్రణాళిక అధికారులకి చట్టాలంటే గౌరవం లేదు..!నిబంధనలు అమలు చేయరు.. కేవలం పనికిమాలిన కొందరు నాయకుల సిఫార్సులు అమలు చేయడానికి ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అసలు అధికారుల లక్ష్యం అక్రమార్కులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, సిఫార్సులు సాకులు చూపడం ఇదే పనిగా తయారైంది.. "అధికారులకు కప్పం కడితే చాలు -- అక్రమం కూడా సక్రమమే" అన్న భావన పెరిగి పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

### అలంకార ప్రాయంగా డిప్యూటీ కమిషనర్..

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 డిప్యూటీ కమిషనర్ అలంకార ప్రాయంగా విధులు నిర్వర్తిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి.. మరోవైపు సర్కిల్ మొత్తానికి పెద్ద దిక్కుగా చెప్పుకునే డిప్యూటీ కమిషనర్, మౌనం వహించడం, అక్రమ నిర్మాణాలపై దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శలు వస్తున్నాయి.. ఏసిబి దాడులు జరిగినా దుండిగల్ సర్కిల్‌ను అవినీతి విడిచి పెట్టడం లేదని ఈ అక్రమ నిర్మాణాల ఉదంతం స్పష్టతను ఇస్తుంది.. డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యంతో టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకం అక్రమ కట్టడాల దందా "మూడు పూవులు ఆరు కాయలు"గా విస్తరించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. నిబంధనలు, అనుమతులు అన్నవి కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు..

పత్రికల్లో ఏమైనా నెగిటివ్ వార్తలు వస్తే..! టౌన్‌ప్లానింగ్ అధికారులకు పౌరుషం తెగ ఉప్పొంగుతుంది.. మరి ఈ అక్రమ కట్టడాల నిర్వాకం ఏంటో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.. గతవారం నాలుగు రోజుల క్రితమే దుండిగల్ ఏసిపి పర్యవేక్షణలో అట్టహాసంగా కూల్చివేసిన అక్రమ నిర్మాణాల్లో ఒకటి మళ్ళీ నిర్మించడంపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. బహుదూర్‌పల్లిలోని 1500 గజాల భారీ షెడ్డు కూల్చామని చెపుతున్న అధికారులు "లంచాలు పుచ్చుకున్నట్టు" స్పష్టమవుతుంది..? సంబంధిత షెడ్డుపై చర్యల ఫొటోలను స్థానికులు సోమవారం "పెన్ పవర్"కి పంపించారు.. ఆ దృశ్యాలు ముడుపుల చర్యలేనని స్పష్టతను ఇస్తుంది.. టౌన్‌ప్లానింగ్ కూల్చివేతల డ్రామాలో..! లక్షల్లో చేతులు మారాయని.. సెటిల్మెంట్‌ల తర్వాతే కట్టుకోవడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతించారనే ఆరోపణలు నిజమేనని రుజువైంది..? హైకోర్టు ఆదేశాలతో గతేడాది జీహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ఆగమేఘాల మీద విడుదల చేసిన "సర్క్యులర్" బుట్టదాఖలు చేస్తున్నారు..! అవినీతి అధికారుల భరతం పడతాం, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామనే ఏసిబి అధికారుల ట్విట్టర్ అకౌంట్ ఏమైంది..? అటు విజిలెన్స్ అధికారుల ఉనికేది..? బరితెగింపు విధులతో ఈ అక్రమ కట్టడాల దందాకు ముగింపు లేనట్టేనా..? సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించినా చర్యలేవి..? నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్న ప్రమాదకర అక్రమ కట్టడాలపై నియంత్రణేది..? దుండిగల్ సర్కిల్‌లో "చర్యలు శూన్యం- వసూళ్ళు శాశ్వతం" అన్నచందంగా తయారైంది..?





పెన్ పవర్ PEN POWER 24 NEWS
epaper.penpower.in | 24 Mar, 2026 | Page: 4
4 పెన్ పవర్ మంగళవారం 24 మార్చి 2026
'ఎసిపి' సారధ్యంలో..! టిజి-బిపాస్ చట్టం ఉల్లంఘన..!
డిప్యూటి కమిషనర్ మౌనం.. చట్టాన్ని తుంగలో తొక్కిన ఘనులు..?
కమిషనర్ దృష్టికి వెళ్లినా చర్యలు శూన్యం..!
హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ GREATER HYDERABAD MUNICIPAL CORPORATION DUNDIGAL CIRCLE
రూ.లక్షల్లో లావాదేవీలు..?
ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి లక్షల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం బయటకు వస్తోంది.. ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన ఫీజులు, పెనాల్టీలు అధికారులు అడ్డదారుల్లో స్వాహా చేసుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.. చట్టం సాధారణ ప్రజలకు మాత్రమేనా..? అధికార పార్టీ నేతలకు, అక్రమార్కులకు వర్తించదా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇలా వ్యవహరిస్తే, నగర అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుందని మండి పడుతున్నారు..
Hyderabad, Telangana, India
epaper.penpower.in | Page: 4 | Clip ID: C-717406
For more details, visit epaper.penpower.in


PEN POWER 24 NEWS
పెన్ పవర్ తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు
4 పెన్ పవర్ శుక్రవారం 27 మార్చి 2026
అవును...! అవి కూల్చివేతలే..!
జాగ్రత్తగా..! నెమ్మదిగా..! పిల్లర్‌లకు తగలకుండా..! ఫొటోషూట్ చర్యలు..!
బహుదూర్‌పల్లిలో..! కమర్షియల్ షట్టర్‌లు..!
సిఫార్సుల భారీ అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు..?
'నో' నోటీస్..!


బహుదూర్‌పల్లిలోని అక్రమ షెడ్డును గత 26న కూల్చివేతల నిర్వాకం చూడండి..

# ఈవీ కారులో మంత్రి పొన్నం, ఎమ్మెల్యే దానం ప్రయాణం

**హైదరాబాద్ పెన్ పవర్:** వైరా ఈవీ వాహనాలను ప్రోత్సహించడంలో భాగంగా మినిస్టర్ క్వార్టర్స్ నుండి అసెంబ్లీ కి ఎలక్ట్రిక్ కారులో మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రయాణం చేసారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాలకు 10-20 శాతం ప్రోత్సాహానికి ముందుకు వచ్చిన టాటా మోటార్స్ ను అభినందించిన మంత్రి పొన్నం, మినిస్టర్ క్వార్టర్స్ నుండి అసెంబ్లీ కి ఎలక్ట్రిక్ కారు లో ప్రయాణం చేసారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడడానికి ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చింది . ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాల్లో కంపెనీలు 10-20 శాతం రాయితులు కల్పిస్తున్నాయి. ఇవి పాలసీలో భాగంగా ప్రభుత్వం 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఇచ్చింది.. ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కోట్లు మినహాయింపు ప్రభుత్వం కల్పించింది. ఈవీ వాహనాల ప్రోత్సాహంలో భాగంగా చార్జింగ్ స్టేషన్ లు , మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఈరోజు రాయితీ ప్రకటించడానికి ముందుకు వచ్చిన టాటా మోటార్స్ కి అభినందనలు ధన్యవాదాలన్నారు.

ఇప్పటికే మహీంద్ర ఎలక్ట్రిక్, గ్రావిటన్ మోటార్స్,ఓలా ఎలక్ట్రిక్స్, ఆతార్ ఎనర్జీ కంపెనీలు ముందుకు వచ్చాయి.. ఈవీ వాహనాలను ప్రోత్సహించడానికి మరిన్ని కంపెనీలు ముందుకు రావాలని ప్రభుత్వం తరుపున విజ్ఞప్తి చేస్తున్ననని అన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**దుబ్బాక, మార్చి 30 పెన్ పవర్:** సదాశివపేట మండలం నాగ్సన్ పల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశం తెలిపారు.

## విద్యార్థినిపై టీచర్ అత్యాచారం.. ఆరుగురిపై కేసు నమోదు

**నారాయణపేట, మార్చి 30 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో టీచర్ అనుచిత ప్రవర్తన కేసులో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక విద్యార్థినిపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు, స్కూల్‌లో సీక్రెట్ కెమెరా ఏర్పాటు చేసి వీడియోలతో రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడైంది. ఈ అత్యాచారం ఘటనలో ఒక ఉపాధ్యాయుడితో పాటు, బ్లాక్ మెయిల్ ఘటనలో మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోక్సో, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.

## కన్నబిడ్డలను సాకలేక... కలెక్టరేట్ లో తల్లి ఆవేదన

**జడ్చర్ల, మార్చి 30 పెన్ పవర్:** బిడ్డలకు కడుపునిండా అన్నం పెట్టలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని, వారిని హాస్టళ్లలో చేర్పించి చదివించాలని కోరుతూ జడ్చర్లకు చెందిన సరోజ అనే మహిళ మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం పిల్లలతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆమె, రెండేళ్ల క్రితం భర్త మరణించడంతో కుటుంబ భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నానని, పిల్లలను హాస్టళ్లలో చేర్పించి, తనకు అక్కడే ఏదైనా పని కల్పించాలని వేడుకున్నారు.

## రాయచూర్ మహాసభలకు నారాయణపేట రైతు నాయకుల తరలింపు



**మక్తల్, మార్చి 30 పెన్ పవర్:** రాయచూర్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకెఎస్) కర్ణాటక రాష్ట్ర మహాసభలకు నారాయణపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు తరలి వెళ్లారు. జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతన్నలను, వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని, ఈ తరుణంలో రాయచూర్ లో జరిగే మహాసభలు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రైతాంగ ఉద్యమాలకు బలం చేకూరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, పి ఓ డబ్ల్యు విజయలక్ష్మి, సునీత, జి వెంకట్ రాములు, ఎదురింటి రాములు, నీలి దామోదర్, పీర్ మైనుద్దీన్, నర్సింలు, అంబదాస్ పాల్గొన్నారు. ఈ మహాసభలు మార్చి 30, 2026న జరిగాయి.

## కృష్ణా నది వంతెనపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

**మహబూబ్‌నగర్, మార్చి 30 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా, మక్తల్ పరిధిలోని కృష్ణ మండలం వాసు నగర్ క్యాంపుకు చెందిన ముదుమాల నాగరాజ్ అనే వ్యక్తి కృష్ణా నది వంతెన పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## గద్వాలలో అగ్ని ప్రమాదం

**గద్వాల, మార్చి 30 పెన్ పవర్:** గద్వాల పట్టణంలోని చిన్న అగ్రహారం సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ పెయింట్ షాప్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.35 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు షాప్ యజమాని రవి తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, షాప్‌లోని పెయింట్ డబ్బాలు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు, అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## కట్టంగూరులో గ్యాస్ కొరత: వినియోగదారుల ఆందోళన

**నల్లగొండ, మార్చి 30 పెన్ పవర్:** నల్గొండ జిల్లా, కట్టంగూరు మండలంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి వంటగ్యాస్ కొరత ఏర్పడింది. చాలామంది గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ, ఆంఅ నంబర్ వస్తేనే గ్యాస్ ఇస్తామని, అది వచ్చేవరకు వేచి ఉండాలని ఏజెన్సీ చెబుతోంది. ఎండాకాలం కావడంతో మండలంలోని పలు గ్రామాల నుంచి వినియోగదారులు రోజు ఆఫీస్ చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

# కొత్త నియోజకవర్గాలు... కలిసొచ్చేదెవరికి

**కరీంనగర్, మార్చి 30 పెన్ పవర్:**
కేంద్రం ఇటీవల నియోజకవర్గాల పునర్విభజనకు అనుమతి ఇచ్చింది. జనాభా ఆధారంగా పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల్లో 50 శాతం పెంచాలని ప్రతిపాదించింది. దీంతో తెలంగాణలో ప్రస్తుతం 119 స్థానాలు ఉండగా కొత్తగా 60 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా 5 స్థానాలు పెరగబోతున్నాయి. దీంతో కరీంనగర్ జిల్లా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సరిహద్దులు మారిపోవడం ఖాయం. దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన నాయకులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే తమ సామాజిక సమీకరణాలు కలిసొస్తాయని, తమ రాజకీయ కల నెరవేరుతుందని ద్వితీయ శ్రేణి నేతలు ఆశపడుతున్నారు. ఈ చదరంగంలో ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనేది ఆసక్తికర అంశంగా మారిందఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుతం 13 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, ఒక పార్లమెంటు స్థానాన్ని కలిగి ఉంది. ఈ నియోజకవర్గాల్లో కొన్ని దశాబ్దాలుగా ఒకే పార్టీ లేదా ఒకే కుటుంబం ఆధీనంలో ఉన్నాయి. సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనుల ఆధారంగా ఓటర్లు నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ నియోజకవర్గాల పెంపు జరిగితే ఈ సమీకరణాలన్నీ మారిపోయే అవకాశం ఉంది.నియోజకవర్గాల పునర్విభజనతో దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన సీనియర్ నేతలకు నియోజకవర్గాల పునర్విభజన పెద్ద తలనొప్పిగా మారింది. పట్టు ఉన్న ప్రాంతాలు వేరు నియోజకవర్గాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. వారికి మద్దతుగా ఉన్న ఓటు బ్యాంకు రెండు లేదా మూడు నియోజకవర్గాలుగా విభజించబడే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గాల్లో కొత్త నేతలు పోటీకి దిగే అవకాశం ఉంది.నియోజకవర్గాల పెంపు ద్వితీయ శ్రేణి నేతలకు, యువ నేతలకు పెద్ద అవకాశంగా మారింది. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుంది. తమ సామాజికవర్గం ఆధిక్యం ఉన్న ప్రాంతాలు కొత్త నియోజకవర్గంగా ఏర్పడితే, గెలుపు అవకాశాలు పెరుగుతాయి. పార్టీలు కూడా కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాయి.రాజకీయ పార్టీలకు నియోజకవర్గాల పెంపు వ్యూహాత్మక అవకాశంగా మారింది. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను కలిపి, కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. విభజన వల్ల అధికార పార్టీ ఓటు బ్యాంకు చీలి, తమకు లాభం చేకూరుతుందని ఆశిస్తుంది. కొత్త నియోజకవర్గాల్లో తమ ప్రాబల్యం చూపించే అవకాశం లభిస్తుంది.కరీంనగర్ జిల్లాలో వివిధ సామాజిక వర్గాలు(రెడ్డి, వెలమ, బ్రాహ్మణ, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ) ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఈ సమీకరణాలు మారిపోతాయి. కొత్త నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గం ఆధిక్యం ఏర్పడితే, ఆ వర్గం నేతకు అవకాశం లభిస్తుంది. వివిధ వర్గాలు సమానంగా ఉన్న నియోజకవర్గాల్లో పోటీ మరింత తీవ్రంగా మారుతుంది. ఒకే సామాజిక వర్గం ఆధిక్యం లేనప్పుడు, వివిధ వర్గాల కూటమి అభ్యర్థి గెలుపు నిర్ణయిస్తుంది.నియోజకవర్గాల పెంపు ఖాయమైతే, పార్టీల లోపల టికెట్ ఆకాంక్షలు పెరుగుతాయి. సీనియర్ నేతలు, యువ నేతల మధ్య ఘర్షణ తప్పదు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారే అవకాశం ఉంది. ఒకే పార్టీ గెలవడం కష్టమైన నియోజకవర్గాల్లో, కూటమి రాజకీయాలు ముఖ్యమవుతాయి. వివిధ సామాజిక వర్గాల నేతలతో కూటమి ఏర్పాటు చేసుకుని, గెలుపును సాధించే ప్రయత్నం జరుగుతుంది. కొత్త నియోజకవర్గాల్లో ప్రచార వ్యూహాలు మారాల్సి ఉంటుంది. సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం మరింత ముఖ్యమవుతుంది. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందినియోజకవర్గాల పెంపు కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పును తీసుకురాబోతోంది. దశాబ్దాలుగా పట్టు సాధించిన సీనియర్ నేతలకు ఇది సవాలుగా మారితే, యువ నేతలకు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలకు ఇది సువర్ణావకాశంగా మారింది.

# దవాఖానాల్లో సూపర్ స్పెషాలీ డాక్టర్లు..

**హైదరాబాద్, మార్చి 30, పెన్ పవర్:**
ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను వైద్య ఆరోగ్య శాఖ రూపొందిస్తోంది. దీని ద్వారా విదేశాల నుండి వచ్చే నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖను పటిష్ఠం చేయటమే కాకుండా.. పేదలకు అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తుంది.పేదరోగులకు నిజంగా ఇది తీపి కబురే. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందనుంది. వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ.. విదేశాల్లో స్థిరపడిన ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలోని పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులలో త్వరలో విదేశీ వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రవాస భారతీయులైన నిపుణుల నైపుణ్యాన్ని ఇక్కడి పేద రోగులకు ఉచితంగా అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తూ.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది.చాలామంది విదేశీ డాక్టర్లకు తమ మాతృభూమికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, సరైన వేదిక లేక వెనుకంజ వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒక కేంద్రీకృత వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఈ పోర్టల్ ద్వారా వైద్యులు తమ స్పెషలైజేషన్, వారు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే రోజులు, కేటాయించగలిగే సమయాన్ని నమోదు చేసుకోవచ్చు. వ్యక్తిగత కారణాలతో లేదా వైద్య సదస్సుల కోసం హైదరాబాద్ వచ్చే నిపుణులు, తమ విరామ సమయంలో కొన్ని రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదా వైద్య విద్యార్థులకు 'గెస్ట్ ఫ్యాకల్టీ'గా బోధించడం వంటి సేవలు అందించవచ్చు.హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలకు కేంద్రంగా మారింది. విదేశాలతో పోలిస్తే ఇక్కడ వైద్య ఖర్చులు తక్కువగా ఉండటం, అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉండటంతో విదేశీ రోగులు కూడా హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ నిపుణులు సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ రంగంలో వైద్య ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. గతంలో విదేశాల్లో పనిచేసిన అనేక మంది నిపుణులు ప్రస్తుతం ఇక్కడి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు. వారి అనుభవాన్ని ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొనసాగించటం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా దక్కుతుంది. ఈ మేరకు రేవంత్ సర్కార్ ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుంది. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం రూపాయి ఖర్చు లేకుండా అందుతుంది.ఇక హైదరాబాద్ నగరంలో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఎల్బీనగర్‌కు మెడికల్ కాలేజీ కేటాయిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ్మా కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు మహేశ్వరం పేరుతో మెడికల్ కాలేజీగా ఉండగా.. ఇక నుంచి ఎల్బీనగర్‌కు కేటాయిస్తున్నట్లు చెప్పారు.



# గోల్డ్ మ్యాన్ కాదు... రోల్డ్ గోల్డ్ మ్యాన్...

**హైదరాబాద్, మార్చి 30, పెన్ పవర్:**
తెలంగాణ గోల్డ్ మ్యాన్.. ఫేక్ అని ఐటీ అధికారులు తేల్చారు. ఒంటిపై కిలోల కొద్ది బంగారు ఆభరణాలను వేసుకుని తిరుగుతున్న బంగారు బాబు.. నకిలీ బంగారు బాబు అని తేల్చారు. ఇటీవల ఢిల్లీలో అతడి బంగారాన్ని సీజ్ చేసుకున్న ఐటీ అధికారులు.. అది నిజమైన బంగారం కాదని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఇన్ని రోజులు బంగారు ఆభరణాలతో తిరిగిన ఆ గోల్డ్ బాబు కాస్తా రోల్డ్ గోల్డ్ బాబు కావడం ఇప్పుడు పెను సంచలనంగా మారిందఇటీవల ఐటీ అధికారులకు చిక్కిన తెలంగాణ గోల్డ్ మ్యాన్ కొండ విజయ్ కుమార్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపుతోంది. విజయ్ కుమార్ ధరించింది అంతా నిజమైన బంగారం కాదని.. నకిలీ గోల్డ్‌తో అతడు అందర్నీ మాయ చేస్తున్నాడని ఐటీ అధికారులు గుర్తించారు. విజయ్ కుమార్ సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ ఇంటర్వ్యూలను పరిగణలోకి తీసుకుని రంగంలోకి దిగిన ఐటీ అధికారులకు అంతా నకిలీ అని తేల్చారు. దీంతో ఆ గోల్డ్ మ్యాన్ వ్యవహారం అందరికీ తెలిసింది.హైదరాబాద్‌లో భారీ బంగారు ఆభరణాలు ధరించి.. మీడియా, సోషల్ మీడియా, నిజ జీవితంలో పెను సంచలనం రేపిన గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్ అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన పల్లపు సురేష్ కుమార్ అలియాస్ సూర్య భాయ్.. ధరించేది నిజమైన బంగారం కాదని.. అది అంతా నకిలీ అని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు తేల్చారు. ఇటీవల అతడిని అడ్డుకున్న ఐటీ అధికారులు.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అతడి ఒంటిపై ధరించిన నగలను సీజ్ చేసి విచారణ చేపట్టగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.తెలంగాణ హాకీ సంఘం అధ్యక్షుడిగా ఉన్న కొండ విజయ్‌కుమార్‌ను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అడ్డుకున్న ఐటీ అధికారులు 12 గంటల సుదీర్ఘ విచారణ తర్వాత అతడు ధరించిన 1.4 కిలోల బంగారాన్ని సీజ్ చేసి విచారణ చేపట్టారు. ఆయన ఆర్థిక మూలాలకు సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఆరా తీశారు. ఆ నగలను విచారణ చేసిన అధికారులు పరీక్షించగా అవి ఫేక్ అని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యారు.గోల్డ్ మ్యాన్ విజయ్ కుమార్ వద్ద ఉన్న సుమారు 32 రకాల భారీ బరువైన ఆభరణాల్లో ఎక్కువ భాగం రాగితో చేసి రోడియం పూత పూసినవేనని తేల్చారు. తన వద్ద ఉన్న ఆభరణాల విలువ సుమారు రూ.1 కోటి ఉంటుందని అతను చెప్పినా.. మార్కెట్ ధర ప్రకారం అది కేవలం రూ. 3 లక్షలే అని ఐటీ అధికారులు నిర్ధారించారు. ఆ నగలు తొందరగా రంగు వెలిసిపోవడంతోపాటు.. అవి కొత్త ఆభరణాలు అన్నట్లుగా ప్రజలను నమ్మించేవాడని ఐటీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.ఇక బంగారు బాబు విజయ్ కుమార్.. లైఫ్ స్టైల్ చూస్తే కోటీశ్వరుడిలా అనిపించినా.. అతని ఆర్థిక పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఈ సంఘటన ద్వారా వెల్లడైంది. 2022-23లోనే కేవలం రూ. 4.9 లక్షల ఆదాయాన్ని మాత్రమే అతడు చూపించాడని తేల్చారు. గత 6 ఏళ్లుగా అతడు ఐటీ రిటర్నులే దాఖలు చేయలేదని ఐటీ అధికారులు తెలిపారు. అతడి పేరు మీద గానీ.. భార్య పేరు మీద గానీ ఎలాంటి స్థిరాస్తులు లేవని గుర్తించారు. నెలకు రూ.20 వేల అద్దె ఇంట్లోనే అతడు నివసిస్తున్నాడని వెల్లడించారు. భూ వివాదాల్లో వచ్చే కమిషన్లతోనే అతడి వద్ద ఉన్న మహీంద్రా థార్.. ఎండీవర్ వంటి లగ్జరీ కార్లను కొనుగోలు చేసినట్లు తేల్చారు.

# మానవాళికి మహావీరుని సందేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో జైన ధర్మం ఒక ఉజ్వలమైన అధ్యాయం. ఈ ధర్మ పరంపరలో అత్యంత పావనమైన, పవిత్రమైన పండుగలలో మహావీర్ జయంతి అగ్రగామిగా నిలుస్తుంది. జైనమతాన్ని సార్వత్రిక మానవతా సందేశాలతో ప్రపంచానికి పరిచయం చేసిన వర్ధమాన మహావీరుడు కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, సమగ్ర నైతిక విలువలకు ప్రతీకగా నిలిచిన మహానుభావుడు. ప్రతి సంవత్సరం చైత్ర మాస శుక్ల పక్ష త్రయోదశి రోజున ఆయన జన్మదినాన్ని జైన సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటుంది. ఈ పర్వదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న జైన ఆలయాలు, ఆశ్రమాలు, పుణ్యక్షేత్రాలు భక్తులతో కళకళలాడుతాయి. భక్తులు ఆయన బోధనలను స్మరించుకోవడం ద్వారా తమ జీవన మార్గాన్ని పునఃసమీక్షించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా అశాంతి, హింస రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో మహావీరుని అహింసా సిద్ధాంతం మునుపెన్నడూ లేనంత ప్రాసంగికతను సంతరించుకుంది. మహావీరుని జీవిత ప్రస్థానాన్ని పరిశీలిస్తే, అది ఒక సామాన్య రాజకుమారుడు 'జీవన్ముక్తుడు'గా మారిన అద్భుత ప్రయాణం అని అర్థమవుతుంది. క్రీస్తు పూర్వం 599 సంవత్సరంలో ప్రస్తుత బీహార్ రాష్ట్రంలోని వైశాలీ నగరానికి సమీపంలో గల కుందగ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి సిద్ధార్థుడు ఒక శక్తివంతమైన తెగకు రాజు, తల్లి త్రిశల దేవి. రాజకుటుంబంలో జన్మించిన వర్ధమానుడికి సకల భోగభాగ్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ఆయన బాల్యం నుంచే విలక్షణమైన ప్రవృత్తిని కనబరిచారు. భౌతిక సుఖాల పట్ల ఆసక్తి చూపకుండా, అంతర్గత శాంతి కోసం తపించేవారు. వర్ధమానుడు పెరుగుతున్న కొద్దీ సంసార బంధాలు, రాజ్యపాలన తన ఆత్మ అన్వేషణకు అడ్డుగోడలని భావించారు. తన ముప్పై ఏళ్ల వయసులో, తల్లిదండ్రుల మరణానంతరం, ఆయన రాజ్యైశ్వర్యాలను, భార్యాబిడ్డలను, చివరకు తన వస్త్రాలను కూడా త్యజించి దిగంబర సన్యాసిగా అడవుల్లోకి వెళ్ళిపోయారు. ఈ త్యాగం మానవ చరిత్రలో ఒక గొప్ప మలుపుగా నిలిచిపోయింది. సన్యాస దీక్ష స్వీకరించిన తర్వాత మహావీరుడు సుమారు పన్నెండున్నర ఏళ్ల పాటు అత్యంత కఠోరమైన తపస్సు చేశారు. శీతోష్ణ స్థితులను లెక్కచేయక, ఆకలి దప్పులను జయించి, మౌన వ్రతాన్ని పాటిస్తూ ఆత్మసాక్షాత్కారం కోసం శ్రమించారు. ఈ సుదీర్ఘ సాధన అనంతరం ఆయన 'కేవల జ్ఞానం' (అనంతమైన జ్ఞానం) పొందారు. అప్పటి నుండి ఆయన 'మహావీరుడు' అని, ఇంద్రియాలను జయించిన 'జిన' అని పిలువబడ్డారు. జ్ఞానోదయం పొందిన తరువాత ఆయన మిగిలిన జీవితాన్ని ప్రజల అజ్ఞానాన్ని పోగొట్టడానికి, వారిలో నైతిక విలువలను పెంపొందించడానికి అంకితం చేశారు. ఆయన బోధనలలో అత్యంత ప్రధానమైనవి ఐదు మహా వ్రతాలు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం మరియు అపరిగ్రహం. ఈ ఐదు సూత్రాలు జైన ధర్మానికి పంచప్రాణాలు వంటివి. ఇవి కేవలం మునులకు, సన్యాసులకు మాత్రమే కాకుండా, సామాన్య మానవులకు కూడా అనుసరణీయమైనవి.

అహింస అనేది మహావీరుని బోధనలలో అన్నింటికంటే గొప్పది. "అహింసా పరమో ధర్మః" అని ఆయన చాటిచెప్పారు. హింస అంటే కేవలం భౌతికంగా చంపడం మాత్రమే కాదు, మాట ద్వారా గానీ, ఆలోచన ద్వారా గానీ ఎదుటి ప్రాణిని బాధపెట్టడం కూడా హింసేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి జీవిలోనూ ఆత్మ ఉంటుందని, అది తనలాగే సుఖదుఃఖాలను అనుభవిస్తుందని గుర్తించినప్పుడు మనిషి క్రూరత్వానికి స్వస్తి పలుకుతాడు. అందుకే "జీవదయే ధర్మం" అనే భావనను ఆయన సమాజంలో బలంగా నాటారు. ఈ అహింసా సిద్ధాంతం కేవలం మనుషులకే పరిమితం కాకుండా, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు, చివరకు మొక్కల వరకు విస్తరించింది. పర్యావరణ పరిరక్షణ గురించి నేడు ప్రపంచం మాట్లాడుతున్న విషయాలను మహావీరుడు వేల ఏళ్ల క్రితమే తన బోధనల ద్వారా తెలియజేశారు. ప్రకృతిలో ప్రతి అణువుకు ప్రాణం ఉందని, దేనినీ అనవసరంగా నాశనం చేయకూడదని ఆయన బోధించారు. మహావీరుడు బోధించిన సత్యం అంటే కేవలం నిజం చెప్పడం మాత్రమే కాదు, అది నిష్కపటమైన ప్రవర్తనను సూచిస్తుంది. అస్తేయం అంటే దొంగతనం చేయకపోవడం, అంటే ఇతరులకు చెందిన ఏ వస్తువును వారి అనుమతి లేకుండా ఆశించకపోవడం. బ్రహ్మచర్యం అంటే ఇంద్రియ నిగ్రహం పాటించడం. ఐదవదైన అపరిగ్రహం అనేది నేటి వినియోగ సంస్కృతికి ఒక గొప్ప విరుగుడు. అపరిగ్రహం అంటే అవసరానికి మించి ఆస్తులను, వస్తువులను సేకరించకపోవడం. మానవుని అత్యాశే అన్ని అనర్థాలకు మూలమని గుర్తించిన మహావీరుడు, పరిమితమైన వనరులతో తృప్తిగా జీవించడం వల్లనే నిజమైన సుఖం లభిస్తుందని చెప్పారు. ఈ సూత్రాలను పాటించడం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయని, శాంతి నెలకొంటుందని ఆయన విశ్వసించారు. మహావీర్ జయంతి వేడుకలు కేవలం ప్రార్థనలకే పరిమితం కావు, అవి సేవా కార్యక్రమాలతో ముడిపడి ఉంటాయి. ఈ రోజున జైన భక్తులు ఉదయాన్నే లేచి ఆలయాలను సందర్శించి తీర్థంకరుల విగ్రహాలకు పవిత్ర జలాలు, పంచామృతాలతో అభిషేకం చేస్తారు. రథయాత్రలు నిర్వహిస్తూ 'మహావీర్ భగవాన్ కీ జై' అంటూ నినాదాలతో పురవీధులను పునీతం చేస్తారు. ఈ వేడుకల్లో అత్యంత ముఖ్యమైన భాగం దానధర్మాలు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం, రోగులకు వైద్య సాయం అందించడం, పశువులకు మేతను సమకూర్చడం వంటి పనులు మహావీరుని 'జీవకారుణ్య' సందేశానికి నిదర్శనాలు. సమాజంలోని అణగారిన వర్గాల పట్ల సానుభూతిని చూపడం ద్వారానే మనం మహావీరుని నిజమైన వారసులమవుతామని భక్తులు నమ్ముతారు.

మహావీరుని బోధనలలో మరొక అద్భుతమైన అంశం 'అనేకాంతవాదం'. ఒకే సత్యాన్ని వివిధ కోణాల్లో చూడవచ్చుని, ఎదుటివారి అభిప్రాయాలను కూడా గౌరవించాలని ఈ సిద్ధాంతం చెప్తుంది. దీనివల్ల మతపరమైన, రాజకీయపరమైన విభేదాలు తొలగిపోయి, భిన్నత్వంలో ఏకత్వం సిద్ధిస్తుంది. నేటి కాలంలో మనుషుల మధ్య పెరుగుతున్న అసహనానికి ఈ సిద్ధాంతం గొప్ప పరిష్కారం చూపుతుంది. పరమత సహనం, పక్కవాడి ఆలోచనలోని సత్యాన్ని అన్వేషించడం వంటివి సమాజ సౌహార్దానికి పునాదులు. మహావీరుడు తన ప్రసంగాలను అప్పటి సామాన్యుల భాష అయిన ప్రాకృతంలో చేయడం వల్ల ఆయన సందేశం గడపగడపకూ చేరుకుంది. ఆయన సంస్కృతానికి బదులుగా ప్రాకృతాన్ని ఎంచుకోవడం ద్వారా జ్ఞానం అనేది అందరికీ అందుబాటులో ఉండాలని ఆశించారు. మహావీరుని 72 ఏళ్ల ప్రయాణం క్రీస్తు పూర్వం 527లో పావాపురిలో మోక్షం (నిర్వాణం) పొందడంతో ముగిసింది. అయితే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అందించిన జ్ఞానదీపం నిరంతరం వెలుగుతూనే ఉంది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో మహాత్మా గాంధీ వంటి మహనీయులు అనుసరించిన సత్యం, అహింస అనే ఆయుధాలకు పునాది మహావీరుని సిద్ధాంతాలే అనడంలో సందేహం లేదు. సమాజంలోని కులవివక్షను వ్యతిరేకించి, స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించిన సంస్కర్త ఆయన. జైన సంఘంలో స్త్రీలకు కూడా సన్యాస దీక్ష తీసుకునే అవకాశం కల్పించి, ఆధ్యాత్మిక రంగంలో వారికి సముచిత స్థానం కల్పించారు. ముగింపుగా చూస్తే, మహావీర్ జయంతి అనేది కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీ కాదు. అది మనలోని అహంకారాన్ని, క్రోధాన్ని, స్వార్థాన్ని వీడమని హెచ్చరించే ఒక పిలుపు. అహింసను ఆయుధంగా మలుచుకుని మనస్సును గెలవడం ఎలాగో నేర్పిన ఆ దివ్య పురుషుడిని స్మరించుకోవడం అంటే, మనం కూడా ఆ మార్గంలో ఒక అడుగు ముందుకు వేయడమే. ప్రపంచం యుద్ధాల భయంతో వణికిపోతున్నప్పుడు, పర్యావరణం వినాశనం అంచున ఉన్నప్పుడు, మహావీరుని బోధనలు ఒక ఆశారేఖలా కనిపిస్తాయి. మన ప్రవర్తనలో మార్పు, తోటి జీవుల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల గౌరవం పెంచుకున్నప్పుడే మహావీర్ జయంతికి అసలైన సార్థకత చేకూరుతుంది. ఆ మహనీయుని సందేశాన్ని హృదయాలలో నింపుకుని, ఆచరణలో పెట్టడం ద్వారానే మనం శాంతియుత సమాజాన్ని నిర్మించగలం.

# సిటీ రోడ్స్‌ కు ఫుల్ నిధులు

**హైదరాబాద్, మార్చి 30, పెన్ పవర్:**

హైదరాబాద్ నగరంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.150 కోట్లు కేటాయించారు. కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం కింద రూ.3,145 కోట్లతో 1,045 కి.మీ ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే నగరవాసులకు గుంతల నుంచి విముక్తి లభించి, ప్రయాణం సాఫీగా సాగనుంది.హైదరాబాద్ మహానగరంలో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. ఇక నుంచి ప్రయాణం సాఫీగా సాగనుంది. నగర ప్రజల ప్రయాణాన్ని సుఖమయం చేసేందుకు మూడు నగరపాలక సంస్థలు నడుం బిగించాయి. జీహెచ్ఎంసీ , సైబరాబాద్ నగరపాలక సంస్థ, మల్కాజిగిరి నగరపాలక సంస్థ సంయుక్తంగా రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేశాయి. ఇప్పటికే సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లు జోన్ల వారీగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించగా.. తాజాగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగరంలోని ఆరు జోన్లకు కలిపి రూ.150 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించారు. ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున కేటాయించిన ఈ బడ్జెట్‌తో అత్యవసర రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నారు. మార్చి 31వ తేదీలోపు రహదారుల అంచనాలు రూపొందించి.. ఉన్నతాధికారుల ఆమోదం పొందాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం పాత జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలో కార్పొరేటర్లకు కేటాయించిన కోటి రూపాయల నిధులలో మెజారిటీ వాటా సీసీ రోడ్ల నిర్మాణానికే ఖర్చవుతోంది. దీనివల్ల ప్రధాన అంతర్గత రహదారుల నిర్వహణ కుంటుపడుతోందన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే కమిషనర్ కేటాయించిన రూ.150 కోట్ల నిధులు అత్యంత కీలకంగా మారాయి. ఇప్పటికే చార్మినార్, సికింద్రాబాద్ జోన్ల అధికారులు



స్పందించి పనులకు ఆమోదం పొందుతున్నారు. మరోవైపు సీఎంసీకి రూ.500 కోట్లు, ఎంఎంసీకి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించగా.. అందులో సీఎంసీ రూ.300 కోట్లు, ఎంఎంసీ రూ.250 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్ పొందాయినగర విస్తరణతో రహదారుల సవాళ్లు కూడా పెరిగాయి. గతంలో 9 వేల కిలోమీటర్లుగా ఉన్న రోడ్ల పొడవు, శివారులోని 27 స్థానిక సంస్థల విలీనంతో ఏకంగా 14,787.66 కిలోమీటర్లకు చేరింది. ఈ శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడం ఇప్పుడు ఇంజినీరింగ్ విభాగం ముందున్న ప్రధాన లక్ష్యం. దీనికి తోడు 'కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం'కింద 1045.01 కిలోమీటర్ల ప్రధాన రహదారులను రూ.3,145 కోట్ల భారీ వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భారీ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. నగరవాసులు ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కడమే కాకుండా, ప్రమాద రహితంగా సాఫీగా ప్రయాణించే వీలుంటుంది. దాంతో పాటు ఆయా కాలనీలు రహదారుల పరంగా అభివృద్ధి చెందనున్నాయి. త్వరలోనే ఈ రోడ్ల నిర్మాణ పనులు పట్టాలెక్కనుండగా.. ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

# అదిలాబాద్, నాగార్జనసాగర్ లలో ఎయిర్ పోర్టు

**హైదరాబాద్, మార్చి 30, పెన్ పవర్:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉడాన్ 2.0' పథకం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో విమానయాన సౌకర్యాలు భారీగా మెరుగుపడనున్నాయి.తెలంగాణలోని ఆదిలాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఉడాన్ 2.0 కింద కేటాయించిన రూ.28,000 కోట్లతో దేశవ్యాప్తంగా 100 ఎయిర్‌పోర్టులు, 200 హెలిపోర్టులను అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణ, ఏపీ ప్రజలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. రెండు రాష్ట్రాల్లో కొత్తగా ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన 'ఉడాన్ 2.0' పథకం రెండు తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త జవజీవాలను అందించబోతోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా లభించబోయే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా ఇప్పటికే ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను పూర్తిస్థాయి విమానాశ్రయాలుగా మార్చడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల తెలంగాణలోని ఆదిలాబాద్, ఏపీలోని పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలకు విమాన కనెక్టివిటీ లభించనుంది.ఆదిలాబాద్‌లో ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌స్ట్రిప్‌ను తాము స్వాధీనం చేసుకోబోమని, దానికి ఆనుకుని ఉన్న అదనపు భూమిని సేకరించి పౌర విమానయాన విమానాశ్రయాన్ని నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే.. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్ నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు భరిస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఉడాన్ 2.0 కింద కేటాయించిన రూ.28,000 కోట్లలో రూ.12,000 కోట్లు విమానాశ్రయాల అభివృద్ధికి, రూ.3,500 కోట్లు 200 హెలిపోర్టుల నిర్మాణానికి కేటాయించారు. విమానయాన సంస్థల నష్టాలను భర్తీ చేసే 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కోసం మరో రూ.10,000 కోట్లు వెచ్చించనున్నారు.తెలంగాణలో వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు ఫైలు ప్రస్తుతం వివిధ శాఖల సంప్రదింపుల దశలో ఉందని, జూన్‌లో దీనికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. కొత్తగూడెం, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టులకు సంబంధించి సరైన భూమిని చూపిస్తే వెంటనే చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విజయవాడ గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాది జూన్ కల్లా ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.మరోవైపు, భారత విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పుగా 'ఎంబ్రాయిర్' సంస్థ దేశీయంగా విమానాల తయారీపై ఆసక్తి చూపుతోందని మంత్రి తెలిపారు. 2028 చివరి నాటికి భారత్‌లో తయారైన తొలి విమానాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో ఆ సంస్థ కసరత్తు చేస్తోందని, ఇది 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పెద్ద విజయమని ఆయన కొనియాడారు. ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తయితే, తెలుగు రాష్ట్రాల మధ్య, దేశంలోని ఇతర ప్రధాన నగరాల మధ్య ప్రయాణ దూరం భారీగా తగ్గడమే కాకుండా ఆర్థిక ప్రగతికి బాటలు పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

**పాలేరు, మార్చి 30 పెన్ పవర్:** ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ఆదివారంతో ముగిసింది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 3,14,501 జవాబుపత్రాలను 1,220 మంది అధ్యాపకులు ఏప్రిల్ 4 నుంచి మూల్యాంకనం చేశారు. అయితే, రీకౌంటింగ్ ప్రక్రియ ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుందని డీఐఈఓ తెలిపారు.

## వరంగల్ జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం

**వరంగల్ ఈస్ట్, మార్చి 30 పెన్ పవర్:** వరంగల్ జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం రేషన్ దుకాణాలకు తరలింపు ప్రారంభమైంది. సుమారు 509 దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. నెలవారీ 5,594.26 మెట్రిక్ టన్నుల బియ్యం స్థానంలో మూడు నెలలకు కలిపి 16,858.94 మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 2,95,442 రేషన్ కార్డులు, 8,92,330 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గణపురంలో వీధి కుక్కల స్వైరవిహారం.. పలువురికి గాయాలు

**భూపాలపల్లి, మార్చి 30 పెన్ పవర్:** భూపాలపల్లి జిల్లా గణపురంలో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్న కుక్కలు, తాజాగా సర్దార్ అనే వృద్ధుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అంతకుముందు చేరాలు అనే వ్యక్తిపై కూడా కుక్కలు దాడి చేశాయి. గ్రామంలో కుక్కల సమస్య తీవ్రంగా ఉన్నా, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## డోర్నకల్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా పెద్దపల్లి దిలీప్ ఏకగ్రీవం



**డోర్నకల్, మార్చి 30 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో తెలంగాణ గంగపుత్ర ఏక సంఘ నిర్మాణం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డోర్నకల్ మండల గంగపుత్ర సంఘం అధ్యక్షులుగా పెద్దపల్లి దిలీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక మార్చి 30, 2026న జరిగింది. ఈ కార్యక్రమంలో గంగపుత్ర రాష్ట్ర అధ్యక్షులు ఎంపటి సైదులు వల్ద్ వెంకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోధుమల సంపత్ కుమార్, రాష్ట్ర కోశాధికారి అనుమాస సత్యనారాయణ పాల్గొన్నారు. ఎన్నికైన అనంతరం దిలీప్ మాట్లాడుతూ గంగపుత్రుల హక్కుల సాధనకై కృషి చేస్తానని తెలిపారు.

## పోడు భూములపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం: గిరిజనులకు అన్యాయం



**ములుగు, మార్చి 30 పెన్ పవర్:** కన్నాయిగూడెం మండలం మల్కపల్లి గ్రామంలో గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు బలవంతంగా లాక్కుని, గుంతలు తీస్తూ వలస ఆదివాసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని టిఏజీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జజ్జరి దామోదర్ ఆరోపించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా, అధికారులతో లాక్కోవడం ప్రభుత్వ విధానమని, దీనిని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాకతీయ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంధ్యారెడ్డికి ఘన సన్మానం

**మహబూబాబాద్, మార్చి 30 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, ములుగులోని పసర గ్రామానికి చెందిన రెడ్డి సంధ్యారెడ్డికి కాకతీయ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో "శివంగి ఆత్మీయ పురస్కారం" అందుకున్న సందర్భంగా సంఘం సభ్యులు ఆమెను అభినందించారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో సంఘం సభ్యులు రెడ్డి సంధ్యారెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె సమాజ సేవా కార్యక్రమాలు, మహిళల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు దిడ్డి మోహన్ రావు మాట్లాడుతూ, వివిధ రంగాల్లో మహిళలు ముందుకు రావడానికి రెడ్డి సంధ్యారెడ్డి చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని అన్నారు.

## నార్సింగిలో విషాదం.. ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

**మెదక్, మార్చి 30 పెన్ పవర్:** నార్సింగి గ్రామంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫిరంగి సత్యనారాయణ (50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కూతురి వివాహం కోసం డబ్బులు సమకూర్చే ప్రయత్నంలో సహాయం లభించక మనస్తాపానికి గురై, గ్రామ శివారులోని పాడుబడిన రైస్ మిల్లులో ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై స్పష్టత

**నర్సాపూర్, మార్చి 30 పెన్ పవర్:** నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, కడియం శ్రీహరిని ఏ పార్టీ అని మాత్రమే ప్రశ్నించారని తెలిపారు. ఇతర సభ్యులను కూడా ఇలాంటి ప్రశ్నలు అడిగిన సందర్భాలు ఉన్నప్పటికీ, కేవలం కౌశిక్ రెడ్డిపైనే చర్యలు తీసుకోవడం అన్యాయమని ఆమె విమర్శించారు.

# సీనియర్ నాయకుడు రవీందర్ మృతి: కాంగ్రెస్ నాయకులు సంతాపం



**ఆదిలాబాద్, మార్చి 30 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు రవీందర్ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్ జాదవ్ పరామర్శించి సంతాపం తెలిపారు. వీరితో పాటు ఇచ్చోడ సర్పంచ్ జలై జాకు, కొమరం కోటేశ్వర్, డాక్టర్ బాలాజీ, పోతన్న, భూమన్న, ఇతర నాయకులు హాజరయ్యారు.

## వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

**బోథ్, మార్చి 30 పెన్ పవర్:** నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్‌లో వడదెబ్బతో కలవలే విజయ్ (38) అనే వ్యవసాయ కూలీ మృతి చెందాడు. వారం రోజుల క్రితం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో చేను పనికి వెళ్లిన విజయ్, అక్కడ ఎండవేడిమికి శనివారం అస్వస్థతకు గురయ్యాడు. ఆసిఫాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఉద్యమకారుల ముందస్తు అరెస్టు

**నిర్మల్, మార్చి 30 పెన్ పవర్:** హైదరాబాద్ లో జరగబోయే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందుగా, బెల్లంపల్లిలో తెలంగాణ ప్రత్యేక ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం జరిగిన ఈ అరెస్టుల అనంతరం, వారిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో చిట్యాల మధు, డోలే సుకుమార్, శంకర్ సింగ్, ఆవుల కొమరయ్య, విజిగిరి రాజేందర్ వంటి పలువురు ఉన్నారు. ఈ చర్యలు అసెంబ్లీ ముట్టడికి సంబంధించిన ముందస్తు పోలీసు చర్యలుగా భావిస్తున్నారు.

## తానూర్ లో పోలీసుల తనిఖీలు: 65 వాహనాలు సీజ్

**ముథోల్, మార్చి 30పెన్ పవర్:** నిర్మల్ జిల్లా తానూర్ గ్రామంలో సోమవారం ఉదయం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ రవీందర్ నాయక్, ఎస్ఐలు అశోక్, పర్విన్, జుబేర్ తో పాటు 20 మందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, మొత్తం 65 వాహనాలను సీజ్ చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని అధికారులు సూచించారు.

## చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పై బీజేపీ నేత ఫిర్యాదు

**చొప్పదండి, మార్చి 30పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ నేత తాడూరి శివకృష్ణ ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సమర్పించిన వినతిపత్రంలో, ప్రజా పనులకు వినియోగించాల్సిన సిబ్బందిని వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడం వల్ల పట్టణంలో పారిశుద్ధ్య పనులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

## ఎల్ఎండీలో తగ్గిన నీటి మట్టం!

**కరీంనగర్, మార్చి 30పెన్ పవర్:** కరీంనగర్ ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలు 7.292 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, ఇకపై రోజు విడిచి రోజు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి నీటి విడుదల లేకుంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష

**హుజూరాబాద్, మార్చి 30పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతిపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. అసెంబ్లీ కమిటీ హాలులో అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో పెండింగ్ నిధులు, ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇరిగేషన్, టూరిజమ్ అధికారులు పాల్గొన్నారు.

## కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తజనం

**వేములవాడ, మార్చి 30పెన్ పవర్:** వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమేశ్వర ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు రాజరాజేశ్వర స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. "అందరినీ చల్లగా చూడు రాజన్న, భీమన్న స్వామి" అంటూ భక్తజనం స్వామివార్లను వేడుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మ దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

## రోడ్డు ప్రమాదం

**ఖమ్మం, మార్చి 30పెన్ పవర్:** పేరుపల్లిలో ఆటో బోల్తా కొట్టడంతో ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం, ఆటో డ్రైవర్ వజ్జా సునీల్ ఆ గ్రామానికి చెందిన ఆరుగురు పిల్లలను ఊరి చివర తీసుకెళ్లారు. పిల్లల్లో ఒకరు ఆటో నడపబోయి అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా కొట్టించారు. ఈ ప్రమాదంలో పులసం యశ్వంత్, అలెం స్నేహితు తీవ్రంగా గాయపడగా, భరత్, తేజ, చిట్టు, ప్రవీణ్ లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

**మధిర, మార్చి 30పెన్ పవర్:** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పిండిప్రోలు శివారు పాపాయిగూడెం గ్రామానికి చెందిన పెయింటింగ్ పని చేసే కందుకూరి శ్రీను (30) ను కొక్కిరేణి పాత స్టేజి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నం శ్రీనివాస్ ఫౌండేషన్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఊటూరు వాసి నక్క శ్రీకర్ కు మయూర జాతీయ పురస్కారం




**మానకొండూరు, మార్చి 30 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన నక్క శ్రీకర్, కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగిన తెలుగు వెలుగు జాతీయ పురస్కార ఉత్సవాలలో భాగంగా మయూర జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ హాస్యనటుడు ఆర్ఎస్ నంద, హాస్యనటి రాధిక, తెలుగు వెలుగు సాహితి వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పోలోజు రాజ్ కుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఊటూరు గ్రామ వాసికి లభించిన ఈ గౌరవం ప్రాధాన్యత సంతరించుకుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# డిజిటల్ ఆస్తికి రక్షణ కవచం

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ పరిణామ క్రమంలో సమాచారం ఎప్పుడూ ఒక శక్తిగానే ఉంటూ వచ్చింది. అక్షరం పుట్టిన నాటి నుండి నేటి అల్గారిథంల కాలం వరకు, సమాచారమే నాగరికతలను నడిపించింది. అయితే, ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఆ సమాచారమే అత్యంత విలువైన 'డేటా'గా, నవయుగ 'చమురు'గా రూపాంతరం చెందింది. ఈ డిజిటల్ విప్లవంలో సమాచారమే సంపదగా, అధికారం కావడంతో దానిని భద్రపరచు కోవడం అనేది వ్యక్తిగత మరియు జాతీయ స్థాయిలలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. ఈ నేపథ్యంలోనే, ప్రజలలో డేటా భద్రతపై చైతన్యం నింపేందుకు ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదీని "ప్రపంచ బ్యాకప్ దినోత్సవం"గా నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మన దైనందిన జీవితంలో నరనరాన జీర్ణించుకుపోయిన ప్రస్తుత తరుణంలో, డేటా భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే అది ఊహించని నష్టాలకు దారితీస్తుంది. ఈ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, మన డిజిటల్ జీవితానికి మనం వేసుకునే భద్రతా కవచం వంటిది. మన స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, సర్వర్లలో నిక్షిప్తమై ఉన్న సమాచారం ఏ క్షణమైనా అదృశ్యం కావచ్చని, దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలని హెచ్చరించడమే ఈ రోజు యొక్క పరమార్థం. ప్రపంచ బ్యాకప్ దినోత్సవం ఆవిర్భావం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. 2011వ సంవత్సరంలో ఒక ప్రముఖ సామాజిక మాధ్యమ వేదికపై జరిగిన చర్చ దీనికి నాంది పలికింది. ఒక సామాన్యుడు తన కంప్యూటర్‌లోని అమూల్యమైన డేటాను కోల్పోయిన విషాదాన్ని పంచుకోగా, అది ప్రపంచ వ్యాప్తంగా వందలాది మందిని కదిలించింది. అందరూ తమ జీవితాల్లోని ఇలాంటి డేటా నష్టాలను ఏకరువు పెట్టడంతో, ఈ సమస్య ఎంత తీవ్రమైనదో ప్రపంచానికి అర్థమైంది. దీంతో డిజిటల్ భద్రతపై ప్రపంచ వ్యాప్త అవగాహన అవసరమని భావించి మార్చి 31ని ఎంచుకున్నారు. ఏప్రిల్ 1న వచ్చే 'ఏప్రిల్ ఫూల్' రోజున ఎవరూ తమ డేటాను కోల్పోయి నిజంగా 'ఫూల్' కాకూడదనే ఉద్దేశంతో, దానికి ముందు రోజైన మార్చి 31న "డోంట్ బి ఎన్ ఏప్రిల్ ఫూల్" అనే వ్యంగ్యాత్మక నినాదంతో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ చమత్కారం వెనుక ఒక గంభీరమైన హెచ్చరిక దాగి ఉంది. మీ డేటాను బ్యాకప్ చేయక పోవడం అంటే, మీ డిజిటల్ ఉనికిని ప్రమాదంలో పడేయడమేనని ఇది స్పష్టం చేస్తోంది.

డేటా నష్టపోవడానికి కారణాలు పరిమితం కావు, అవి అనంతం. భౌతిక పరికరాల వైఫల్యం నుండి అత్యాధునిక సైబర్ దాడుల వరకు అనేక ముప్పులు పొంచి ఉన్నాయి. హార్డ్ డిస్క్ డ్రైవ్‌లు లేదా ఎస్.ఎస్.డిలు ఎప్పుడైనా సాంకేతిక లోపంతో ఆగిపోవచ్చు. సాఫ్ట్‌వేర్ క్రాష్ కావడం, అనుకోకుండా కీలకమైన ఫైళ్లను డిలీట్ చేయడం వంటివి నిత్యం జరిగే పొరపాట్లు. వీటికి తోడు ర్యాన్సమ్‌వేర్ వంటి భయంకరమైన వైరస్ దాడులు నేడు సంస్థలను గడగడలాడిస్తున్నాయి. హ్యాకర్లు మన డేటాను లాక్ చేసి, దానిని తిరిగి ఇచ్చేందుకు భారీగా డబ్బు డిమాండ్ చేస్తున్నారు. గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పది సెకన్లకు ఒక ర్యాన్సమ్‌వేర్ దాడి జరుగుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రకృతి విపత్తులైన వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మనం భౌతికంగా భద్రపరిచిన పరికరాలు కూడా కాలిపోవచ్చు లేదా కొట్టుకుపోవచ్చు. ఇలాంటి సమయాల్లో డేటా బ్యాకప్ లేకపోతే ఒక వ్యక్తి జీవితకాల కష్టం లేదా ఒక సంస్థ దశాబ్దాల చరిత్ర నిమిషాల్లో బూడిదైపోతుంది. దాదాపు 30 శాతం మంది వినియోగదారులు తమ జీవితంలో కనీసం ఒక్కసారైనా డేటా నష్టాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, హార్డ్‌వేర్ మార్చుకోవచ్చు కానీ, అందులో పోయిన డేటాను తిరిగి సృష్టించడం అసాధ్యం. బ్యాకప్ అంటే కేవలం ఒక ఫైలును కాపీ చేయడం మాత్రమే కాదు, అది ఒక క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ. దీనిని ప్రధానంగా భౌతిక నిల్వ మరియు క్లౌడ్ నిల్వ అనే రెండు విధాలుగా విభజించవచ్చు. హార్డ్ డిస్క్, పెన్ డ్రైవ్ వంటి పరికరాలు వ్యక్తిగత నియంత్రణలో ఉంటాయి. కానీ, ప్రస్తుత క్లౌడ్ కంప్యూటింగ్ యుగంలో గూగుల్ డ్రైవ్, వన్‌డ్రైవ్, డ్రాప్‌బాక్స్ వంటి సేవలు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఇవి ఆటోమేటిక్ బ్యాకప్ సౌకర్యాన్ని కల్పిస్తూ, డేటాను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేసుకునే వెసులుబాటును ఇస్తున్నాయి. బ్యాకప్ చేసే విధానంలో కూడా ఫుల్ బ్యాకప్, ఇన్‌క్రిమెంటల్ బ్యాకప్ మరియు డిఫరెన్షియల్ బ్యాకప్ అనే మూడు కీలక పద్ధతులు ఉన్నాయి. మొత్తం డేటాను ఒకేసారి సేవ్ చేయడం మొదటి పద్ధతి అయితే, కేవలం మారిన ఫైళ్లను మాత్రమే సేవ్ చేయడం మిగిలిన రెండు పద్ధతుల ప్రత్యేకత. ఇవి సమయాన్ని, ఇంటర్నెట్ డేటాను ఆదా చేయడంలో తోడ్పడతాయి. సాంకేతిక నిపుణులు సూచించే అత్యంత ప్రభావవంతమైన సూత్రం "3-2-1 బ్యాకప్ రూల్". దీని ప్రకారం ప్రతి ఫైలుకు కనీసం మూడు కాపీలు ఉండాలి, వాటిని రెండు వేర్వేరు మీడియా రకాల్లో ఉంచాలి, మరియు ఒక కాపీని భౌతికంగా మన కార్యాలయం

లేదా ఇంటికి దూరంగా మరో సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. ఈ విధానం అనుసరిస్తే ఎలాంటి విపత్తు సంభవించినా డేటాను తిరిగి పొందడం సులభం అవుతుంది.

వ్యాపార ప్రపంచంలో డేటా అనేది ప్రాణవాయువు వంటిది. నేటి కాలంలో డేటా లేని వ్యాపారాన్ని ఊహించలేము. చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలపై డేటా నష్టం చూపే ప్రభావం అత్యంత విధ్వంసకరంగా ఉంటుంది. ఒక సర్వే ప్రకారం, భారీ డేటా నష్టాన్ని ఎదుర్కొన్న చిన్న సంస్థలలో 60 శాతం ఆరు నెలల లోపే మూతపడు తున్నాయి. ఎందుకంటే సమాచారం లేనిదే లావాదేవీలు నిర్వహించడం, కస్టమర్ల వివరాలను తెలుసు కోవడం సాధ్యం కాదు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ మరియు ఇ-కామర్స్ రంగాలలో డేటా భద్రత అనేది చట్టపరమైన బాధ్యత కూడా. రోగుల రికార్డులు లేదా ఆర్థిక లావాదేవీల డేటా లీక్ అయినా లేదా పోయినా, ఆ సంస్థలు కోట్లాది రూపాయల జరిమానాలతో పాటు ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోతాయి. డేటా ప్రైవసీ చట్టాలు నేడు కఠినతరం కావడంతో, డేటాను భద్రపరచడం అనేది నైతిక బాధ్యతగా మారింది. కంపెనీలు తమ బిజినెస్ కంటిన్యూటీ ప్లాన్ (ఃఅఖ)లో భాగంగా బ్యాకప్ వ్యవస్థలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. వ్యక్తిగత స్థాయిలో మనం డేటాను కేవలం ఫైళ్లుగా చూడకూడదు, అవి మన జ్ఞాపకాలు. మన స్మార్ట్‌ఫోన్‌లలో ఉండే ఫోటోలు, వీడియోలు కేవలం చిత్రాలు మాత్రమే కాదు, అవి మన జీవితంలోని మధుర క్షణాలు. అలాగే విద్యా ధృవపత్రాలు, ఆస్తుల పత్రాలు, ఆధార్ వంటి గుర్తింపు కార్డుల స్కాన్ కాపీలు డిజిటల్ రూపంలో ఉన్నప్పుడు, మొబైల్ పోవడమో లేదా ఫోన్ పాడవ్వడమో జరిగితే ఆ నష్టాన్ని వెలకట్టలేము. ప్రతి ఏటా లక్షలాది మొబైల్ ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయి. ఒకవేళ మీరు ఆటోమేటిక్ క్లౌడ్ బ్యాకప్ ఆన్ చేసి ఉంటే, కొత్త ఫోన్ కొన్న నిమిషాల్లోనే మీ పాత సమాచారమంతా తిరిగి వస్తుంది. లేదంటే ఆ జ్ఞాపకాలు శాశ్వతంగా కనుమరు గవుతాయి. అందువల్ల, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని, నిరంతరం సింక్రనైజేషన్ చేయడం ద్వారా మన వ్యక్తిగత డిజిటల్ సామ్రాజ్యాన్ని రక్షించుకోవచ్చు.

ప్రభుత్వాలు కూడా నేడు డిజిటల్ పరిపాలన వైపు అడుగులు వేస్తున్నాయి. 'డిజిటల్ ఇండియా' వంటి బృహత్తర కార్యక్రమాల వల్ల కోట్లాది మంది ప్రజల వివరాలు సర్వర్లలో నిక్షిప్తమై ఉన్నాయి. భూ రికార్డుల నుండి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వరకు అంతా డేటామయమే. ఇటువంటి కీలక సమయంలో ప్రభుత్వ డేటా సెంటర్లు ప్రకృతి వైపరీత్యాల నుండి, సైబర్ దాడుల నుండి రక్షించబడటం అత్యవసరం. దీనికోసం వివిధ ప్రాంతాల్లో డేటా రికవరీ సెంటర్లు (ఆఖీ ాతిబివబ) ఏర్పాటు చేయబడు తున్నాయి. అంటే ఒక నగరంలో డేటా సెంటర్ దెబ్బతిన్నా, మరో నగరంలో ఉన్న బ్యాకప్ సెంటర్ ద్వారా సేవలు అంతరాయం లేకుండా కొనసాగుతాయి. ఇది దేశ భద్రతలో ఒక అంతర్భాగం. ప్రపంచ బ్యాకప్ దినోత్సవం సందర్భంగా అనేక టెక్నాలజీ సంస్థలు ఉచిత క్లౌడ్ స్టోరేజ్ ఆఫర్లు లేదా రాయితీలను ప్రకటిస్తాయి. సైబర్ భద్రతా నిపుణులు వెబినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించి సురక్షితమైన పాస్‌వర్డ్ నిర్వహణ మరియు ఎన్‌క్రిప్షన్ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ మనల్ని ఒకసారి ఆగి ఆలోచించమని కోరుతున్నాయి. "నేను చివరిసారిగా నా డేటాను ఎప్పుడు బ్యాకప్ చేశాను?" అనే ప్రశ్నకు సమాధానం మన దగ్గర ఉండాలి. బ్యాకప్ అనేది ఒకసారి చేసే పని కాదు, అది ఒక నిరంతర అలవాటుగా మారాలి. వారం వారం లేదా నెలకోసారి షెడ్యూల్ చేసుకుని డేటాను భద్రపరుచు కోవాలి. సైబర్ ముప్పులు పెరిగిపోతున్న ఈ తరుణంలో "ముందు జాగ్రత్తే ముక్తి మార్గం" అన్నది డేటా విషయంలోనూ అక్షర సత్యం. చివరగా, సాంకేతికత ఎంతటి మహోన్నత శిఖరాలకు చేరినా, దానిలో లోపాలు సంభవించడం సహజం. మన అప్రమత్తతే అత్యుత్తమ రక్షణ. డేటా అనేది భవిష్యత్తును నిర్మించే ఇంధనం, దానిని నిర్లక్ష్యం చేయడం అంటే మన భవిష్యత్తును చీకటిలోకి నెట్టడమే. ప్రపంచ బ్యాకప్ దినోత్సవం ఇచ్చే సందేశం స్పష్టం: "అప్రమత్తంగా ఉండండి, భద్రంగా ఉండండి". మన డిజిటల్ ఆస్తులను రక్షించు కోవడానికి కేటాయించే కొద్దిపాటి సమయం, భవిష్యత్తులో రాబోయే భారీ విపత్తుల నుండి మనల్ని కాపాడుతుంది. డేటా బ్యాకప్ తీసుకోవడం ద్వారా మనం కేవలం ఫైళ్లను మాత్రమే కాదు, మన శ్రమను, మన సమయాన్ని, మన జ్ఞాపకాలను మరియు మన ఆర్థిక స్థిరత్వాన్ని భద్రపరుచు కుంటున్నాము. ఈ డిజిటల్ యుగంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా ప్రతి ఒక్కరూ ఈ అలవాటును పాటిస్తూ, ఇతరులకు కూడా అవగాహన కల్పించడం ద్వారా సురక్షితమైన డిజిటల్ సమాజాన్ని నిర్మించగలము. మీ డేటాను ఇప్పుడే బ్యాకప్ చేయండి, రేపటి భద్రతకు బాటలు వేయండి. డేటా బ్యాకప్ అనేది కేవలం సాంకేతిక అవసరం కాదు, అది ఒక బాధ్యత. ఈ ప్రపంచ బ్యాకప్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ డిజిటల్ ఆస్తుల రక్షణకు ప్రతిజ్ఞ చేద్దాం.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ చెడుగుడు

**హైదరాబాద్, మార్చి 30, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ మంత్రులతో కలిసే నిర్ణయాలు తీసుకుటున్నారు. ఢిల్లీకి వెళ్లినా ఒకరిద్దరు మంత్రలును తీసుకెళ్లడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. విదేశీ పర్యటనలకు కూడా మంత్రులు వెళ్తున్నారు. అయితే రెండున్నరేళ్లయినా సీఎం సత్తాను మంత్రులు సరిగా గుర్తించలేదు. కానీ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి తాజాగా తన రాజకీయ పటుత్వాన్ని, వాదనా చాతుర్యాన్ని ప్రదర్శించడంతోపాటు, ప్రతిపక్ష నేత హరీశ్ రావుపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించి గులాబీ శిబిరానికి ఊహించని షాకిచ్చారు. ఈ ఘటన తర్వాత కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ మంత్రులకు కూడా తమకు, సీఎంకు మధ్యనున్న నాయకత్వ అంతరాన్ని, రేవంత్ 'విలువ'ను స్పష్టంగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడిందిఇతర పార్టీల మాదిరిగా కాకుండా, కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన రాజకీయ సంస్కృతి కనిపిస్తూ ఉంటుంది. పార్టీలో సీనియర్ నేతలు ఎవరూ కూడా తమకంటే వయసులోనూ, అనుభవంలోనూ చిన్నవారైన రేవంత్ అధికృతను సులభంగా అంగీకరించలేకపోయారు. ఎన్నికల సమయంలో పది మంది ఎమ్మెల్యేల్ని గెలిపించుకోవడానికి ముందుకు రాని నేతలు, అధికారం వచ్చిన తర్వాత మాత్రం మంత్రి పదవుల కోసం పోటీపడ్డారు.

ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ చేతికే అధికార దండాన్ని అప్పజెప్పింది. ఇది ఆయన సామర్థ్యానికి నిదర్శనం. అసెంబ్లీ సమావేశాలు సీఎం సత్తాను మరోసారి నిరూపించాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై హరీశ్ రావు విరుచుకుపడిన సమయంలో, ఇతర మంత్రుల దగ్గర సరైన సమాధానాలు లేకపోయాయి. ఈ తరుణంలో రంగంలోకి దిగిన రేవంత్, హరీశ్ వాదనను పూర్తిగా ఖండించారు. కేవలం వాదనతోనే కాకుండా, సీబీసీఐడీ విచారణకు ఆదేశించడం ద్వారా ప్రతిపక్షాన్ని నిలువరించారు. ఇది ఆయన నిర్ణయ తీసుకునే సామర్థ్యాన్ని చాటిచెప్పింది. ఈ ఘటన తర్వాత, తాము కేవలం పాలనలో భాగస్వాములమే కానీ, నిజమైన నాయకుడు సీఎం మాత్రమేనని మంత్రులకు అర్థమైంది.రేవంత్ నాయకత్వ సామర్థ్యానికి ఇది కేవలం రాష్ట్రస్థాయి గుర్తింపు మాత్రమే కాదు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది. 2025లో దేశంలోనే అత్యంత శక్తిమంతులైన 100 మంది జాబితాలో రేవంత్ రెడ్డికి 28వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోలిస్తే 11 స్థానాలు మెరుగుపరచుకున్నారు. జాతీయ స్థాయిలో ఇండి కూటమిలో ఆయన పోషిస్తున్న కీలక పాత్ర, తెలంగాణలో తీసుకువచ్చిన సంస్కరణలే ఈ గుర్తింపుకు కారణం.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, మితిమీరిన ఆత్మవిశ్వాసం కాంగ్రెస్ విజయానికి కారణమయ్యాయని అంటారు. కానీ, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, అధికారాన్ని నిలబెట్టుకునే విషయంలో రేవంత్ కీలక పాత్ర పోషించారు. అసెంబ్లీ సాక్షిగా ఆయన ప్రదర్శించిన పటుత్వం, సీనియర్ మంత్రులకు తమ 'విలువ'కు, సీఎం 'విలువ'కు మధ్యనున్న తేడాను స్పష్టంగా చూపించింది.

# రాజధాని మార్పు సాధ్యం కాదా...

**గుంటూరు, మార్చి 30, పెన్ పవర్:** రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు తీర్మానం చేసింది ఏపీ అసంబ్లీ. కేంద్రం కూడా విభజన చట్టంలో పెట్టేస్తుంది. అంత వరకూ బాగానే ఉంది. కానీ జగన్ సీఎం అయితే రాజధానిని మార్చలేరన్న ప్రచారం మాత్రం అవాస్తవం. మన దేశంలో అమలు చేసినవే చట్టాలు. అమలు చేయకూడదనుకుంటే..దాని కోసం పాలకులు ఎన్నో మార్గాలు వెదుకుతారు. రాజధాని విషయంలో చట్టబద్ధత ఉంటే ఇక మార్పు అసాధ్యం అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వ్యవస్థలను ఎలా వాడుకోవాలో, చట్టాల్లోని లొసుగులను ఎలా వెతకాలో తెలిసిన పాలకులకు ఏదీ అసాధ్యం కాదు. విభజన చట్టంలో అమరావతి పేరు చేర్చినంత మాత్రాన అది శాశ్వతం అయిపోదు. చట్టాలు అనేవి పాలనను క్రమబద్ధం చేయడానికి ఉంటాయి కానీ, పాలకుల పట్టుదలను అడ్డుకోలేవు. గతంలో మూడు రాజధానులు అనే ప్రతిపాదన తెచ్చినప్పుడు, అమరావతిని తీసేస్తున్నామని వారు ఎక్కడా చెప్పలేదు. కానీ, అభివృద్ధిని ఆపేయడం ద్వారా, నిధులను మళ్లించడం ద్వారా ఆ ప్రాంతాన్ని ఒక ఎడారిగా మార్చగలిగారు. అంటే, చట్టాన్ని మార్చకపోయినా, దాని ప్రాధాన్యతను తగ్గించే నిర్వీర్య ప్రక్రియ రాజకీయంగా చాలా సులభం. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే అధికారం ఉంటుందనేది జగన్ చెప్పేమాట. విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలు కేవలం గెస్ట్ హౌస్‌లు మాత్రమే కావు, అవి ఒక సమాంతర సచివాలయానికి పునాదులు. చట్టం ప్రకారం రాజధాని అమరావతిలోనే ఉన్నా, క్యాంప్ ఆఫీస్ పేరుతో పాలకుడు విశాఖ నుంచే చక్రం తిప్పవచ్చు. జగన్ అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని ప్రకటన చేసి.. సీఎంకాగానే రాజధాని నిర్మాణానికి అవసరమైన రూ. 50 వేల కోట్ల ప్రాజెక్టును అర్ధాంతరంగా ఆపేయడం, అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్ వంటి వాటిని వెనక్కి వెళ్లేలా చేశారు. తర్వాత సీఎం అయినా ఇలా చేయరన్న గ్యారంటీలేదు.రాజధాని అంటే కేవలం భవనాలు కాదు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ. ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు అన్నీ నమ్మకం మీద ఆధారపడి వస్తాయి. పాలకుడు మారినప్పుడల్లా రాజధాని మారుతుందన్న భయం ఉంటే ఏ పెట్టుబడిదారుడూ ఏపీ వైపు చూడడు. యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే నిలకడైన పాలన, రాజధాని పట్ల స్పష్టమైన విజన్ ఉన్న నాయకత్వం అవసరం. గందరగోళం సృష్టించే ధోరణి ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే, చట్టం ఉన్నా లేకపోయినా అభివృద్ధి కుంటుపడుతుంది. అమరావతిని ఎవరూ మార్చలేరు అనే ధీమా మంచిదే. కానీ మార్చబోము .. అమరావతిని అభివృద్ధి చేస్తామని వైసీపీ ఇప్పటికీ ప్రకటించలేదు. ప్రకటించినా నమ్మే పరిస్థితుల్లో జనం లేరు. రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను



వాడుకుని, వ్యవస్థలను మేనేజ్ చేసి, ఒక ప్రాంతాన్ని పనికిరాకుండా చేసే శక్తి అధికారంలో ఉన్న వారికి ఉంటుంది. ఆ పని గతంలో జగన్ చేశారు. వస్తే మళ్లీ చేస్తారు. రాజధాని మనుగడ అనేది కేవలం చట్టం మీద కాదు, ఆ చట్టాన్ని అమలు చేసే వ్యక్తి ఉద్దేశం మీద ఆధారపడి ఉంటుంది. ఏపీ భవిష్యత్తు నిలవాలంటే, రాజధానిని ఒక సెంటిమెంట్ గా కాకుండా 'కమిట్‌మెంట్' గా భావించే నాయకత్వం కొనసాగాల్సిన అవసరం ఉంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చను ప్రారంభిస్తూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచస్థాయి రాజధానిని నిర్మించాలనే సంకల్పంతో 34 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి కేవలం రాజకీయ కక్షతో రాజధానిని స్మశానంగా మార్చారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల ముసుగులో అమరావతిని అనాథను చేశారని, రైతులను రోడ్డున పడేసిన పాపం గత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు చేస్తున్న తీర్మానం అమరావతికి రక్షణ కవచంలా మారుతుందని భరోసా ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. అమరావతి అనేది కేవలం ఒక కులానికో, ప్రాంతానికో చెందింది కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం అని గర్జించారు. జగన్ సర్కార్ రాజధానిని చెరబట్టి రాష్ట్ర భవిష్యత్తును పదేళ్లు వెనక్కి నెట్టేసిందని విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని, కనీసం తప్పు ఒప్పుకునే ధైర్యం కూడా వారికి లేదని ఎద్దేవా చేశారు. అమరావతిని వెలుగుల జిలుగుల నగరంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. ఐదేళ్ల పాలనను సైకో పాలన గా నారా లోకేష్ అభివర్ణించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రాఫిక్స్‌ద

అంటూ అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇన్సైడర్ ట్రేడింగ్ పేరుతో బురదజల్లి, కోర్టుల చుట్టూ తిప్పి కాలయాపన చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు అమరావతికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడమే కాకుండా, చట్టబద్ధత కల్పించి ఏ శక్తీ అడ్డుకోలేని విధంగా అభివృద్ధి చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అమరావతి రైతులపై జరిగిన దాడులు, అక్రమ కేసులను అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. బీజేపీ సభ్యుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని, విభజన చట్టం సవరణ ద్వారా దీనికి మరింత బలం వస్తుందని పేర్కొన్నారు. విష్ణుకుమార్ రాజు వంటి నేతలు కూడా జగన్ ప్రభుత్వం చేసిన రాజధాని ద్రోహం ను అంకెలు, సాక్ష్యాలతో సహా వివరించారు. ఈ చర్చకు వైసీపీ హాజరుకాకపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. కూటమి నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టే అవకాశం ఉన్నా, సభను బహిష్కరించడం ద్వారా వైసీపీ తన ఓటమి ని అంగీకరించినట్లయింది. తప్పు ఒప్పుకున్నట్లయింది.

# కడపలో స్టీల్ ప్లాంట్ అడుగులు

**కడప, మార్చి 30 పెన్ పవర్:** ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె పరిసరాల్లో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి, సుమారు 3 వేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర లిమిటెడ్ సంస్థకు అప్పగిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దశాబ్దాలుగా రాయలసీమ ప్రజల కలగా ఉన్న ఈ ఉక్కు పరిశ్రమ సాకారం కావడానికి ఈ భూముల బదిలీ ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నారు. గతంలో ఈ ప్రాజెక్టు కోసం వివిధ సంస్థలతో చర్చలు జరిగినప్పటికీ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉక్కు ఉత్పత్తి చేసేందుకు జిందాల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా దాదాపు 3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిందాల్ సంస్థ సుమారు రూ. 8,883 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. భూమి అప్పగింత ప్రక్రియ పూర్తి కావడంతో, ఇక ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి ఊపందుకోవడమే కాకుండా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన కడప జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా వెలిసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్ రహదారి సౌకర్యాలను కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. భూసేకరణ సమయంలో స్థానిక రైతుల నుంచి వచ్చిన అభ్యర్థనలు, పరిహారం పంపిణీ వంటి అంశాలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించింది. వైసీపీ హయంలో శంకుస్థాపన జరిగినప్పటికీ.. భూ సమస్యలను పరిష్కరించకపోవడంతో పట్టాలెక్కలేదు. ఇప్పుడు ప్రభుత్వం అన్నీ పరిష్కరిస్తోంది. జిందాల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తవుతుందని అటు రాజకీయ వర్గాలు, ఇటు పారిశ్రామిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రంలో కడప స్టీల్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలవనుంది. స్టీల్ ప్లాంట్ నిర్మించాలన్నది దశాబ్దాల కల. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది గత కొన్నేళ్లుగా ఆలోచన. ఎట్టకేలకు అది కార్యరూపం దాల్చబోతోంది. ఈ పరిశ్రమ కోసం సేకరించిన మూడువేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర పరిశ్రమకు బదలాయించింది కూటమి ప్రభుత్వం. అందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.



దశాబ్దాల కల నెరవేరే రోజు ఆసన్నం అయ్యింది. గతంలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు చాలా కంపెనీలతో చర్చలు జరిగాయి. అయితే అత్యున్నత ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ దాదాపు మూడు మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ సుమారు రూ. 8,883 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. ప్రధానమైన భూ బదలాయింపు జరగడంతో మిగిలిన పనులు మొదలు పెట్టనుంది జిందాల్వెనుకబడిన జిల్లాగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. శంకుస్థాపన కూడా చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిహారం పంపిణీ పూర్తి అయ్యింది. మరోవైపు ప్లాంట్ కు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రహదారులతోపాటు తాగునీరు అందించాలని నిర్ణయించింది. మొత్తానికి అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఒక ముందడుగు పడినట్లు అయ్యింది.

# అమరావతి ఎప్పుడు ప్రారంభం అవుతుందో తెలుసా

**విజయవాడ, మార్చి 30, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానంపై చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతిలో చేపట్టిన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎ చంద్రబాబు వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులను 2025 మే 2వ తేదీన పునఃప్రారంభించినట్లు చంద్రబాబు గుర్తు చేశారు. 2028 ఆగస్ట్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. ప్రారంభోత్సవానికి మరోసారి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అమరావతిలోని ట్రంక్ రోడ్లను మే 27, 2027 నాటి పూర్తిచేస్తామని చంద్రబాబు తెలిపారు. అమరావతి లేఅవుట్లను మే 27, 2028 నాటికి, ఏపీ అసెంబ్లీ నిర్మాణాన్ని మే 28, 2028 నాటికల్లా పూర్తిచేస్తామని చంద్రబాబు వివరించారు. అలాగే ఏపీ హైకోర్టు నిర్మాణాన్ని జూన్ 20, 2028 నాటికి.. అమరావతి ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని ఆగస్ట్ 4, 2028 నాటికి పూర్తిచేసి.. ప్రధాని మోదీని ప్రారంభోత్సానికి ఆహ్వానిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతి ప్రజా రాజధాని అని చెప్పిన చంద్రబాబు.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే చట్టబద్ధత కల్పిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది నెలల కాలంలోనే అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను పూర్తి చేశామని చంద్రబాబు వివరించారు. అమరావతిలో ప్రస్తుతం

56 వేలకోట్ల రూపాయల విలువైన పనులు జరుగుతున్నాయని.. 2028 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అమరావతిలో హింసను సృష్టించాలని ప్రయత్నించేవారికి.. అదే చివరి రోజు అవుతుందంటూ చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉంటుందని.. అది అమరావతి మాత్రమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరంటూ చంద్రబాబు స్పష్టం చేశారు

# పార్టీలు మార్పులు తప్పవా

**విజయవాడ, మార్చి30, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల పాత్ర మరింత కీలకంగా మారుతున్నది. గత ఎన్నికల సమయంలోనే చాలా మంది నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చడం కనిపించింది. ఎవరికైతే ఎక్కడ అవకాశాలు కనిపించాయో, వారు ఆ దిశగా అడుగులు వేసిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ , జనసేన, వైసీపీ ఇలా ఏ పార్టీలో చూసినా ఎన్నికల ముందు మార్పులు కనిపిస్తూనే ఉంటాయి.గెలిచిన వారు తమ స్థాయిని పెంచుకోగా, ఓడిన వారు కొత్త అవకాశాల కోసం మళ్లీ రాజకీయ సమీకరణలను పరిశీలిస్తున్నారు.రాబోయే ఎన్నికల నాటికి ఈ మార్పులు మరింత వేగంగా జరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో, రాజకీయ నాయకులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఇది ఒకవైపు పార్టీలకు కూడా అవసరం అవుతుంది. ఎందుకంటే కొత్త సీట్లు పెరిగినప్పుడు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం కీలకం అవుతుంది. అందువల్ల గెలుపు సామర్థ్యం ఉన్న నాయకులను ఆకర్షించేందుకు పార్టీలు కూడా ముందుకు రావాల్సి ఉంటుంది.గత ఎన్నికల సమయంలో టికెట్ల కోసం జరిగిన రాజకీయ మార్పులు అందరికీ గుర్తున్నాయి. చాలామంది నాయకులు తమకు టికెట్ వచ్చే అవకాశాలను బట్టి పార్టీలు మార్చుకున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా గెలుపు గుర్రాలుగా భావించిన నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నాయి. ఈ విధంగా ఇరువర్గాల మధ్య పరస్పర ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఇప్పటి పరిస్థితుల్లో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశముంది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి. కొత్త ప్రాంతాలు, కొత్త ఓటరు సమీకరణాలు రావడం వల్ల నాయకులు తమకు అనుకూలంగా ఉండే పార్టీలు లేదా వర్గాలను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. దీంతో రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.అయితే ఈ స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది. నాయకులు తరచూ పార్టీలు మారడం వల్ల రాజకీయ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో అనేక మంది నాయకులు తమకు అనుకూలంగా పార్టీలను మార్చుకుని రాజకీయంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు.ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు నాయకులు పార్టీ పట్ల నిబద్ధత చూపుతారా లేక వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు పెట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజల అభిప్రాయం కూడా ఈ విషయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మరోపక్క ఇలా పార్టీలు మారిన వారికి పదవులు కట్టు పెట్టడం వల్ల కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వారి మనోభావాలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం పవర్ఫుల్ నాయకులకు అనుకూలంగా మారుతోంది. ఈ అవకాశాన్ని వారు ఎలా వినియోగించుకుంటారన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు వస్తుంది. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

# పార్లమెంట్ లో వైసీపీ స్టాండ్ ఏంటీ



**నెల్లూరు, మార్చి 30 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం తీవ్ర విభజనతో సాగుతున్నాయి. ఇక్కడ రాజకీయ పార్టీలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా శత్రువులుగా చూసుకునే స్థాయికి చేరుకున్నాయని అనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య సంప్రదాయాలు కూడా చాలా వరకు కనుమరుగయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించే చర్చా సంస్కృతి, పరస్పర గౌరవం వంటి అంశాలు ఏపీలో కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధ హోదా కల్పించాలనే అంశంపై రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం ఆమోదించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అదే సమయంలో శాసన మండలి లో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టకపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీనిపై విమర్శలు చేస్తూ, ఇది కేవలం రాజకీయ నాటకమని ఆరోపిస్తోంది.రెండు సభలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమైన అంశాలను రెండింటిలోనూ చర్చించడం సాధారణ పద్ధతి. కానీ ఈ సందర్భంలో పరిస్థితి భిన్నంగా మారింది. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారు చర్చకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు మండలిలో వైసీపీకి బలం ఎక్కువగా ఉండడంతో అక్కడ చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిని రాజకీయ వ్యూహంగా చూడాలని కొందరు అభిప్రాయపడుతున్నారు.అయితే ఈ అంశంలో కూటమి ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని స్పష్టంగా తీసుకుందని అంటున్నారు. అమరావతి విషయంలో రాష్ట్ర శాసనసభ తీర్మానం కేవలం అభిప్రాయాన్ని తెలియజేయడానికే పరిమితమని నిపుణులు చెబుతున్నారు. ఇది చట్టం చేసే ప్రక్రియ కాదని, కేవలం కేంద్రానికి రాష్ట్ర అభిప్రాయం చేరవేయడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేస్తున్నారు.అసలు చట్టబద్ధ ప్రక్రియ మొత్తం పార్లమెంట్ పరిధిలో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లో మార్పులు చేయాల్సి ఉండటంతో, కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ప్రవేశపెడుతుంది. ఆ బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పుడే అమరావతి అధికారికంగా శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందుతుంది.ఈ నేపథ్యంలో శాసన మండలిలో తీర్మానం ప్రవేశపెట్టకపోవడం పెద్ద సమస్య కాదని కొందరు రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే కేంద్రం కోరింది రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం మాత్రమేనని, అది తీర్మానం ద్వారా పంపించబడిందని వారు చెబుతున్నారు. ఇక వైసీపీ ఈ అంశంపై విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా వారికి నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ చర్చలో పాల్గొనకపోవడం ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చని అంటున్నారు. మొత్తంగా అమరావతి అంశం చుట్టూ రాజకీయంగా వేడి పెరుగుతుండగా, రాబోయే రోజుల్లో కేంద్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

# ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివాసీ యువకునిపై ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాలం.అశోక్ బాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణలు కోరారు. ఎస్టి కులంలో బెంతోరియా సామాజిక వర్గాన్ని చేరుస్తున్నారని వారిని ఎస్టిలుగా పరిగనించవద్దని ఎస్టి వర్గాలు అశోక్ బాబును కలవడానికి వచ్చినప్పుడు ఎస్టి యువకుడు భగవాన్ తనను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడానికి నువ్వెవరు! అని ప్రశ్నించటంతో తాను ఆవేశంలో ఆ వ్యాఖ్యలు అతనిపై చేసానే కానీ ఆ సామజికవర్గాన్ని ఉద్దేశించి కాదని అన్నారు. 26వ తారీఖున జరిగిన మొత్తం సంభాషణ వార్తలు వేస్తే బాగున్నని కానీ కొంతమంది ఆ విజువల్స్ ను ఎడిటింగ్ చేసి తాను తప్పుమాట్లాడినట్లు చూపించటం తగదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రోజు ఆ యువకుడు తరుపున ఆ సామజికవర్గం తనకు క్షమాపణ చెప్పారని అది ప్రజలకు తెలిసేలా చేసుంటే విషయం తారస్థాయికి చేరేది కాదని అన్నారు. వైసీపీ హయాంలో బెంతోరియా కులానికి చేసింది ఏమి లేకపోయిన తన వ్యాఖ్యలను సామజిక మాధ్యమాల్లో పెట్టి తనను బయపెట్టాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని ఇటువంటి తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు వలన ఎవరి మనోభావాలు దెబ్బతిన్న తాను బహిరంగ క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# కువైట్‌లో ఇరాన్ దాడి.. భారత కార్మికుడి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కువైట్‌లో విషాదం చోటుచేసుకుంది. ఇరాన్ జరిపిన ఓ దాడిలో భారత కార్మికుడు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఒక విద్యుత్ కేంద్రంలోని భవనం కూడా దెబ్బతిన్నట్లు కువైట్ విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఆదివారం సాయంత్రం దేశంలోని ఒక విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారంపై ఇరాన్ దాడికి పాల్పడిందని కువైట్ అధికారులు తెలిపారు. “ఈ దాడిలో ప్లాంట్‌లోని ఒక సర్వీస్ భవనం దెబ్బతింది. ఒక భారతీయ కార్మికుడు మరణించారు” అని మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇంజనీర్ ఫాతిమా అబ్బాస్ జవహర్ హయత్ ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఏడుకు చేరిందని రాయిటర్స్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. వీరిలో సౌదీ అరేబియాలో ఒకరు, ఒమన్‌లో ఇద్దరు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఇద్దరు ఉన్నారు. మరో భారతీయుడు గల్లంతైనట్లు సమాచారం. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. తాజా ఘటనపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం లేదా భారత విదేశాంగ శాఖ (ఓఇం) ఇంకా స్పందించలేదు. అయితే, మరణించిన వారి మృతదేహాలను స్వదేశానికి తరలించడానికి, ఆయా దేశాల్లో చిక్కుకున్న పౌరులకు సహాయం చేయడానికి తమ రాయబార కార్యాలయాలు సమన్వయం చేస్తున్నాయని విదేశాంగ శాఖ ఇప్పటికే వెల్లడించింది.

# అమెరికాకు ఇరాన్ వార్నింగ్..

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రా యెల్ సంయుక్తంగా యుద్ధం ప్రారంభించి నెల రోజులు గడిచిన నేపథ్యంలో, ఇరాన్ తాజాగా అమెరికాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. పర్షియన్ గల్ఫ్‌లోకి అమెరికా సైన్యాన్ని పంపితే, వారు ‘సొరచేపలకు ఆహారంగా’ మారతారని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. ఈ అవకాశం కోసం తమ సైనికులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారని పేర్కొంది. ఇరాన్ సైన్యం నిన్న విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో, ఆ దేశ ప్రధాన కమాండ్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఇబ్రాహీం జోల్ఫఘారి ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ‘ఇజ్రాయెల్ నాయకత్వానికి బానిస’ అని, ‘ప్రపంచంలోనే అత్యంత అసత్యాలు పలికే అధ్యక్షుడు’ అని అభివర్ణించారు. ఆయన నిర్ణయాల్లో స్థిరత్వం లేదని, ఒక క్షణం చర్చలంటూనే మరుక్షణం యుద్ధానికి సిద్ధమవుతారని విమర్శించారు. జెఫ్రీ ఎప్‌స్టిన్ కేసుకు సంబంధించిన పాత సంబంధాల కారణంగా ట్రంప్‌పై ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మోసాద్ ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు.

# నేపాల్‌లో కొనసాగుతున్న ‘మాజీమంత్రుల’ అరెస్టులు

**హైదరాబాద్ పెన్ పవర్:** నేపాల్‌లో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో జెన్‌జెడ్ నిరసనల కారణంగా తలెత్తిన అల్లర్లు, ఘర్షణల్లో నిర్లక్ష్యపూరితమైన హత్యలకు పాల్పడ్డారన్న అభియోగాలపై నేపాల్ మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయి. తాజాగా నేపాల్ మాజీ ఇంధన శాఖ మంత్రి దీపక్ ఖడ్కాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా దీపక్ ఖడ్కాను ఈ ఉదయం అరెస్ట్ చేసినట్లు సిబిఐ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. నేపాల్ మనీలాండరింగ్ దర్యాప్తు విభాగం ఈ విచారణను పర్యవేక్షిస్తోందని అన్నారు. సెప్టెంబర్ 9వ తేదీన నిరసనల సందర్భంగ ఖడ్కా నివాసం నుండి స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆదివారం ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారని కొత్త హోం వ్యవహారాల మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. సెప్టెంబర్ 8,9 తేదీల్లో జరిగిన నిరసనల అణచివేతలో సుమారు 76మంది మరణించినట్లు అల్లర్లపై ఏర్పాటైన విచారణ కమిషన్ పేర్కొంది. నిరసనకారులు పార్లమెంట్ భవనం సహా ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుపెట్టారు. ఖడ్కా నివాసానికి నిప్పుపెట్టడంతో పాటు ఆయన నివాసంలో దొరికిన నగదును నిరసనకారులు గాల్లోకి విసిరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గామారిన సంగతి తెలిసిందే.

# యుద్ధం వద్దంటూ అమెరికా వ్యాప్తంగా నిరసనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలికి వ్యతిరేకంగా అగ్రరాజ్యం, ఐరోపా దేశాల్లో ప్రజలు పెద్దఎత్తున ‘నో కింగ్స్’ నిరసనలు చేశారు. అమెరికా వ్యాప్తంగా 50 రాష్ట్రాల్లో చేపట్టిన 3,100 నిరసన కార్యక్రమాల్లో లక్షలమంది పాల్గొన్నారు. వాషింగ్టన్, లాస్ ఏంజెలెస్, డాలస్, ఫిలడెల్ఫియా, న్యూయార్క్ వంటి నగరాల్లో భారీ ప్రదర్శనలు జరిగాయి. పౌర హక్కులు, వలసదారులపై ట్రంప్ నిరంకుశ విధానాలు, ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా సైన్యం పాత్రపై ఆందోళకారులు గళమెత్తారు. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ట్రంప్‌నకు వ్యతిరేకంగా చేపట్టిన అతిపెద్ద నిరసనలుగా అమెరికా మీడియా వీటిని అభివర్ణించింది. ఈ ఆందోళనలకు కేంద్రంగా మిన్నెసోటా నిలిచింది. లాస్ ఏంజెలెస్‌లోని ఫెడరల్ డిటెన్షన్ సెంటర్ వద్ద ఆందోళనకారులు పలు వస్తువులను విసిరేయడంతో.. భద్రతాదళాలు బాష్పవాయువును ప్రయోగించాయి. డల్లాస్‌లో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో కొందరు నిరసనకారులను పోలీసులు అరెస్టుచేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలంటూ లండన్, పారిస్, రోమ్ వంటి పెద్ద నగరాల్లోనూ ట్రంప్ విధానాలపై ఆందోళనలు చేపట్టారు.

## అమెరికాపై దాడి చేయగల క్షిపణి ఇంజిన్‌ను పరీక్షించిన ఉ.కొరియా

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాను చేరుకునేంత అధిక శక్తి కలిగిన, ఘన ఇంధన క్షిపణి ఇంజిన్‌ను ఉత్తర కొరియా పరీక్షించింది. దేశ నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా దీన్ని పర్యవేక్షించారు. దీంతో వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని మెరుగుపర్చుకొనే దిశగా ప్యాంగ్యాంగ్ మరో అడుగు ముందుకేసినట్లైంది. అమెరికా, దాని మిత్రదేశాలు కూడా పసిగట్టలేని సామర్థ్యాలున్న ఖండాంతర క్షిపణుల్ని రానున్న ఐదేళ్లలో సమకూర్చుకుంటామని కిమ్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ వ్యాఖ్యలను ఒట్టి ప్రగల్భాలుగా కొందరు నిపుణులు కొట్టిపారేస్తున్నారు. తాజాగా పరీక్షించిన ఇంజిన్‌లో కార్బన్ ఫైబర్ పదార్థాలను వినియోగించామని, ఇది గరిష్ఠంగా 2,500 కిలో టన్నుల శక్తిని వెలువరిస్తుందని ఉత్తర కొరియా అధికారిక మీడియా పేర్కొంది. దేశ సైనిక సత్తాను పెంచడానికి ఈ పరీక్ష దోహదపడుతుందని ఈ సందర్భంగా కిమ్ తెలిపారు.

# అమెరికాలో ‘ఐసీఈ’పై రాజకీయం

**ఇమ్మిగ్రేషన్ పాలసీపై డెమోక్రాట్లు వర్సెస్ రిపబ్లికన్లు**

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) నిధులపై డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య జరిగిన రాజకీయ పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఇరు పక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వినియోగించుకునేందుకు చూస్తున్నాయి. అయితే ఇందులో ఎవరి ప్రయత్నాలను వారు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు, పరిశీలకులు చెప్తున్నారు.అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇమ్మిగ్రేషన్ అధికారులపై చట్టపరమైన నియంత్రణలు విధించాలని ప్రయత్నించారు. అయితే రిపబ్లికన్ల నుంచి సహజంగానే మద్దతు లేకపోవడంతో ఈ ఫలితాలు విజయవంతం కాలేదు. అయినప్పటికీ.. నవంబర్ ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని రెండు పార్టీలూ ఆశిస్తున్నాయని పరిశీలకులు చెప్తున్నారు. ప్రభుత్వం షట్‌డౌన్‌ను ముగించేందుకు సెనెట్ ఆమోదించిన రాజీ బిల్లును హౌజ్ రిపబ్లికన్లు తిరస్కరించారు. తర్వాత వారు తమ స్వంత ప్రతిపాదనను తీసుకొచ్చారు. అయితే దానిని సెనెట్ డెమోక్రాట్లు అంగీకరించబోమని స్పష్టం చేశారు. డెమోక్రాట్లు ఐస్ అధికారుల కఠిన చర్యలను వ్యతిరేకిస్తూ, వారికి అదనపు నిధులు ఇవ్వకుండా నిలిచారు. అలాగే అధికారులు తమను గుర్తించాల్సిన అవసరం, మాస్కులు ధరించకూడదని, చర్చిలు, ఆస్పత్రులు, పాఠశాలల వద్ద చర్యలు ఆపాలనీ, వ్యక్తిగత ఇండ్లలోకి ప్రవేశించడానికి కోర్టు అనుమతి తీసుకోవాలని వారు కోరారు. కానీ ఈ ప్రతిపాదనలను రిపబ్లికన్లు తిరస్కరించారు. కాగా రిపబ్లికన్లు ట్రంప్ ఇచ్చిన హామీ ప్రకారం

అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించడం అవసరమని వాదిస్తున్నారు. అలాగే వారు ఓటింగ్ సంస్కరణల బిల్లు (సేవ్ అమెరికా యాక్ట్) ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించి, విఫలమ య్యారు. ఇరుపక్షాలు తమ వైపు విజయంగా చూపించుకునే అవకాశాలు ఉన్నప్పటికీ? ఆ ప్రయోజనం పెద్దగా ఏ పక్షానికీ కలగలేదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో రిపబ్లికన్లు ఇమ్మిగ్రేషన్ అంశాన్ని బలంగా వినియోగించుకునే అవకాశం ఉందని వారు అంటున్నారు.

# వృద్ధాప్య పింఛను పెంపు డిఎంకె మేనిఫెస్టో విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** వృద్ధాప్య పింఛను రూ.2 వేలకు పెంచుతున్నామని, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుకు రూ.8 వేల కూపన్ అందజేస్తామని తమిళనాడు అధికార పార్టీ డిఎంకె హామీ ఇచ్చారు. డిఎంకె ఎన్నికల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధ్యక్షులు ఎంకె స్టాలిన్ సీనియర్ నాయకులతో కలిసి పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో ఆదివారం విడుదల చేశారు. ‘ఇల్లతరసి పథకం’ను ప్రకటించారు. ఈ పథకం కింద వాషింగ్ మిషన్, టివి, గ్రైండర్, ఫ్రిజ్, మిక్సి, మైక్రోవేవ్ ఓవెన్, ఇండక్షన్ స్టవ్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తమ సమీప దుకాణాల్లో కొనుగోలు చేసుకోవడానికి గృహిణులకు రూ.8 వేల కూపన్లు ఇవ్వనున్నారు. ఆదాయపు పన్ను పరిధిలోకి రాని గృహిణులందరికీ ఈ పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు. మహిళా కుటుంబ పెద్దల కోసం ఉద్దేశించిన ‘కళైజ్ఞర్ మంగళిర్ ఉరిమై తోగై’ పథకాన్ని రూ.1,000 నుంచి రూ.2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. కొత్త పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయా అనే విలేకరుల ప్రశ్నకు స్టాలిన్ సమాధానం ఇస్తూ ‘2021 ఎన్నికల్లోనూ ఇలాంటి సందేహాలే వ్యక్తం చేశారు. డిఎంకె ప్రభుత్వం తన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చింది’ అని తెలిపారు. రెండంకెల వృద్ధిని సాధించిన ఏకైక రాష్ట్రం తమిళనాడు అని స్టాలిన్ తెలిపారు. డిఎంకె ఏడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని 8వ తరగతి విద్యార్థుల వరకూ విస్తరిస్తామని స్టాలిన్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకాన్ని 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల వరకే అమలు చేస్తున్నారు. మళ్లీ డింఎకె అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛను పథకాన్ని రూ. 1,200 నుంచి రూ. 2,000 వరకూ పెంచనున్నారు. ఉచిత విద్యుత్ పొందుతున్న రైతులకు ఉచితంగా మీటర్ అమర్చనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు.



ముఖ్యమంత్రి బీమా పథకం కోసం వార్షిక వేతన పరిమితిని రూ 5 లక్షలుగా నిర్ణయించారు. ఈ పథకం బీమా మొత్తం రూ. 10 లక్షలుగా ఉంటుంది.

# జర్నలిస్టుపై గుజరాత్ పోలీసుల దాష్టీకం

**హైదరాబాద్ పెన్ పవర్:** గుజరాత్‌లోని రాజ్‌కోట్ పోలీసులు ఒక స్థానిక జర్నలిస్టును చిత్రహింసలకు గురి చేశారు. ప్రయివేట్ పార్టులపై పెట్రోల్ పోయడంతో పాటు తలకిందులుగా వేలాడ దీసి, జంతువుల్లా చితకబాదారు. దీంతో జర్నలిస్టు కాలు విరగడంతో సహా వీపు, తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. కస్టడీలో తీవ్రంగా హింసించడంతో పాటు తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని, ఇంటిని కూల్చివేస్తామని కూడా జర్నలిస్టును పోలీసులు బెదరించారు. తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలైన తరువాత కూడా జర్నలిస్టును పోలీసులు విడిచిపెట్టలేదు. జర్నలిస్టును ఆస్పత్రిలో చేర్చుకోవద్దని రాజ్‌కోట్ సివిల్ ఆస్పత్రి వైద్యులపై పోలీసులు ఒత్తిడి తెచ్చారు. ఈ ఘటన పూర్తి వివరాల ప్రకారం రాజ్‌కోట్‌కు చెందిన సుదేశ్ వదేచా అనే జర్నలిస్టు సొంతంగా ‘ఖబర్ రాజ్‌కోట్ కి న్యూస్’ అనే ఆన్‌లైన్ మీడియా సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న సుదేశ్‌ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. తరువాత రాజ్‌కోట్ క్రైమ్ బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జగదీష్ బంగద్వా, అతని బృందం జర్నలిస్టుపై కస్టడీలో హింసకు పాల్పడ్డారు. అసిమ్ అగమ్ అనే బిల్డర్‌కు సాగిస్తున్న అక్రమ నిర్మాణ కార్యకలాపాల గురించి వార్తలు రాస్తున్న కారణంగానే పోలీసులు తనపై దాడికి పాల్పడ్డారని జర్నలిస్టు విమర్శిస్తున్నారు. తనపై ఎలాంటి తీవ్రమైన ఫిర్యాదు లేవని, కేవలం బిల్డర్ ఆదేశాల మేరకే ఈ దాడి జరిగిందని తెలిపారు. ఈ విమర్శలను డీసీపీ బంగద్వా ఖండించారు. జర్నలిస్టుపై ఎలాంటి దాడి చేయలేదని, అతనిపై ఎనిమిది కేసులు ఉన్నాయని, వాటి నుంచి విచారణను తప్పించుకోవడానికే ఇలాంటి నాటకం ఆడుతున్నారని పేర్కొన్నారు.ం

జర్నలిస్టుపై కేసుకు సంబంధించిన పత్రాలను డీసీపీ విలేకరులకు చూపించినా, అవి అధికారిక ఎఫ్ఐఆర్లు కాకపోవడం గమనార్హం. కాగా, జర్నలిస్టుపై దాడిని కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగేశ్ మేవానీ, మాజీ ఐపీఎస్ అధికారి రమేశ్ సవానీ తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఐదు గ్యారంటీలతో అస్సాం బరిలో కాంగ్రెస్

**హైదరాబాద్ పెన్ పవర్:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ “ఐదు గ్యారంటీలు” (ఈతిలవ ఉబీజీతీజీనిబివవబ) పేరుతో సంక్షేమ పథకాలను ప్రకటించింది. ఆదివారం లఖింపూర్ జిల్లాలోని నౌబోయిచాలో జరిగిన భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ కీలక ప్రకటనలు చేశారు. గతంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించిన “గ్యారంటీ మోడల్”నే ఇప్పుడు అస్సాం ఎన్నికల్లోనూ అస్త్రంగా వాడుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబన: రాష్ట్రంలోని ప్రతి మహిళా లబ్ధిదారుకు బ్యాంక్ ఖాతాలో ఎటువంటి షరతులు లేకుండా ప్రతి నెలా నగదు జమ చేస్తారు. దీనికి అదనంగా, సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే లేదా ఉన్న వ్యాపారాన్ని విస్తరించాలనుకునే మహిళలకు రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తారు. నగదు రహిత ఆరోగ్య భీమా: అస్సాంలోని ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల వరకు వర్తించేలా క్యాష్‌లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల నుండి భారీ ఉపశమనం కలిగించనుంది. భూమి పట్టాలు : అస్సాం స్థానికతను కాపాడటంలో భాగంగా, సుమారు 10 లక్షల మంది మూలవాసులకు (ఎనిటతిణవనినీబీబ జూవనీజూశ్రీవ) శాశ్వత భూమి పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా భూమి హక్కుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది కీలకమైన హామీ. సామాజిక భద్రత పెన్షన్ : రాష్ట్రంలోని వృద్ధులందరికీ సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రతి నెలా రూ. 1,250 వృద్ధాప్య పింఛను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తారు. జుబీన్ గార్గ్ కేసు: అస్సాం ప్రజల ఆరాధ్య గాయకుడు జుబీన్ గార్గ్ మరణం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బాధ్యులకు శిక్ష



పడేలా చర్యలు తీసుకుంటామని సంచలన హామీ ఇచ్చారు. ఇది అస్సామీ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశాన్ని కాంగ్రెస్ ఓటుతో ముడిపెట్టి చూస్తోందని తెలుస్తోంది.

# పెళ్లి భోజనంలో లెగ్ పీసులు రాలేదని రచ్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** తమకు చికెన్ లెగ్ పీసులు అందలేదనే ఆరోపణలతో ఒక పెళ్లి రిసెప్షన్ సందర్భంగా పెళ్లి వేదిక వద్ద గ్యాంగ్ ఫైట్ జరిగింది. ఈ విషాద సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో చోటుచేసుకుంది. పెళ్లికొడుకు కుటుంబం ఈ గొడవను ప్రారంభించింది. ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. కొంతమంది టేబుల్ పైకి ఎక్కి పెద్ద బిర్యానీ గిన్నెల నుండి తమకు ఇష్టమైన ముక్కలను తింటూ కూడా వీడియోలో కనిపిస్తున్నారు. పెళ్లి రిసెప్షన్‌లో వడ్డించిన బిర్యానీలో చికెన్ లెగ్ పీసులు అందలేదని ఆరోపిస్తూ పెళ్లికొడుకు కుటుంబం గొడవ సృష్టించింది. పరిస్థితి విషమించడం

చూసి, పెళ్లికూతురి కుటుంబం కూడా జోక్యం చేసుకుంది. దీంతో మాటల యుద్ధం పిడిగుద్దుల పోరాటానికి దారితీసింది. పెళ్లికొడుకుతో వచ్చిన వారు పెళ్లి రిసెప్షన్‌లోని కుర్చీలను, టేబుళ్లను ధ్వంసం చేశారు. చివరకు పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.


# ఆయనపైనే ఛార్జిషీట్ వేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత చర్యలపై ఛార్జిషీట్ వేయాలని, భాజపా అధికారంలోకి వస్తే లక్ష్మీర్ భండార్ పథకాన్ని రద్దు చేస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ స్పష్టం చేశారు. 2021 ఎన్నికల సందర్భంగా తనకు అయిన గాయంపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలనూ ఆమె తప్పుబట్టారు. పురూలియా జిల్లాలోని మన్ బజార్ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి సంధ్యారాణి తుడుకు మద్దతుగా ఆదివారం మమత ప్రచారం చేశారు. శనివారం తనపై రాజకీయ ఛార్జిషీట్‌ను విడుదల చేసిన అమిత్ షాపై మమత తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ ప్రతిసారీ రాజకీయ బాధితురాలి కార్డును వాడుతున్నారని శనివారం నాటి కార్యక్రమంలో అమిత్ షా ఆరోపించారు. ‘కొన్నిసార్లు ఆమె తన గాయం గురించి మాట్లాడతారు.

కొన్నిసార్లు ఎన్నికల కమిషన్‌ను తిడతారు’ అని విమర్శించారు. ఈ విమర్శలపై మమత తీవ్రంగా స్పందించారు. ‘దిల్లీ నుంచి శనివారం ఒక పెద్ద నేత వచ్చారు. తృణమూల్‌పై ఛార్జిషీట్ ప్రకటించారు. మాపై ఛార్జిషీట్ వేయడానికి మీరెవరు.. మీపైనే ఛార్జిషీట్ వేయాలి’ అని వ్యాఖ్యానించారు.

## ప్రతి అక్రమ వలసదారునూ పంపేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** గత పదేళ్లుగా అస్సాంలో అక్రమ చొరబాట్లను భాజపా ప్రభుత్వం అడ్డుకుందని, ఇదొక్కటే సరిపోదని, ప్రతి అక్రమ వలసదారునూ వెనక్కి పంపాల్సిందేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న ఐదేళ్లలో దేశంలోని ప్రతి అక్రమ వలసదారును పంపించివేస్తామని పేర్కొన్నారు.



అస్సాంలోని ఢెకియాజులీలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అక్రమ వలసదారులు అస్సాం యువత ఉపాధిని లాక్కుంటున్నారని, పేదల ఆహారాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు. చొరబాటుదార్లను రక్షించడానికే ఓటర్ల జాబితాల సవరణను (సర్) కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. అస్సాంలో హ్యాట్రిక్ సాధిస్తామని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మార్గరిటాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శించారు.

# మందగించిన ఆర్థిక సూచీల వృద్ధి



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నెలకొన్న పరిమితులు ఆర్థిక సూచికల వృద్ధి మందగింపును సూచిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో పేర్కొంది. మార్చి నెలవారీ ఆర్థిక సమీక్షను ఆర్థిక వ్యవహారాల శాఖ (డిఇఎ) శనివారం విడుదల చేసింది. పశ్చిమాసియాతో బలమైన వాణిజ్య, పెట్టుబడి, విదేశాలకు నగదు బదిలీ సంబంధాలు కలిగిన భారతదేశానికి (ప్రధాన ఇంధన దిగుమతిదారు) ఈ సంఘర్షణలు "సంక్లిష్టమైన, బహుళ అంచెల ఆర్థిక ఇబ్బందులను" కలిగిస్తున్నాయని పేర్కొంది. "2026 మార్చి నాటి తొలి ఆర్థిక నివేదికలు ఈ ప్రపంచ పరిణామాల ప్రభావాన్ని ప్రతిబింబించేలా వృద్ధిలో మందగమనాన్ని సూచిస్తున్నాయి" అని నివేదిక తెలిపింది. "మార్చి 22 వరకు నెలవారీ ఇ ? వే బిల్లుల జారీ 5.3 శాతం తగ్గింది. ఇది వస్తువుల రవాణాలో కొంత మందగమనాన్ని సూచిస్తుంది. అయితే వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తే.. ఇది 9.4శాతం అధికంగానే ఉంది. ఇంధన ధరల పెరుగుదల షాక్ తర్వాత ఉత్పత్తి వృద్ధిలో మందగమనాన్ని పిఎంఐ (పర్చేజింగ్ మానేజర్స్ ఇండెక్స్) సూచిస్తోంది" అని నివేదిక తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్లు మార్చి 24 వరకు గతేడాదితో పోలిస్తే 19.1శాతం పెరిగాయని, మార్చి 22 వరకు డిజిటల్ చెల్లింపులు రెండంకెల వృద్ధిని కొనసాగించిందని తెలిపింది. గ్రామీణ ఆర్థిక పరిస్థితులు, అభిప్రాయాల సర్వే మార్చి 2026లో గ్రామీణ అభిప్రాయాల్లో కొంత తగ్గుదల ఉన్నట్లు సూచిస్తోంది. అయితే వినియోగ వృద్ధి బలపడింది. ఈ సర్వేను 2026 ఫిబ్రవరి చివరి వారంలో మరియు మార్చి మొదటి వారంలో నిర్వహించినట్లు తెలిపింది.

భారతదేశం చమురు, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జి అవసరాల కోసం దిగుమతులపై, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలపై ఆధారపడింది. దీంతో నిర్దిష్ట రంగాలపై స్థూల ఆర్థిక ప్రభావాన్ని కూడా నివేదిక చర్చించింది. అనేక రంగాల్లో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలైన గాజు లేదా సిరామిక్స్ వంటి నిరంతరం ఉత్పత్తి కొనసాగే పరిశ్రమలకు ఇంధనాలను, ముడిపదార్థాలు అందకపోవడంతో ఉత్పత్తి కోతకు, తాత్కాలిక మూసివేతకు దారితీశాయని నివేదిక తెలిపింది. లభ్యత లేకపోవడం, వ్యయ పెరుగుదల రెండూ కూడా లాభాల మార్జిన్లు, ఉత్పత్తిపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయి. రవాణా అంతరాయాలు, సరఫరా మార్గాల మార్పులు, యుద్ధ ప్రమాద ప్రీమియంలతో సరుకు రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో రవాణా ఆలస్యం కావడం, డెలివరీ సమయాన్ని పొడిగించాయని పేర్కొంది. దీంతో కీలకమైన ముడిసరుకుల దిగుమతులకు, ఎగుమతులకు నిబంధనలు తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపింది.

# 66,500 డాలర్లకు పడిపోయిన బిట్ కాయిన్



ప్రస్తుతం అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్‌లో డిజిటల్ కరెన్సీ అయిన బిట్‌కాయిన్ (ఃతిబిఇనీతిని) తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. గత కొద్ది రోజులుగా బిట్‌కాయిన్ ధర 65,900 నుంచి 66,500 డాలర్ల మధ్య కొనసుగుతోంది.మార్చి 27న 65,720 డాలర్ల కనిష్ట స్థాయికి కూడా పడిపోయింది. గత 24 గంటల్లో సుమారు 1 శాతం, గత వారం రోజుల్లో దాదాపు 4 శాతం మేర విలువను కోల్పోయిన బిట్‌కాయిన్, ఈ ఏడాదిలో ఇప్పటికే మూడుసార్లు ఇదే స్థాయి వద్ద నిలదొక్కుకుంది. అయితే, ఈసారి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ సపోర్ట్ లెవల్ ఎంతవరకు నిలబడుతుందనేది ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

బిట్‌కాయిన్ ధరల ఆకస్మిక పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది మిడిల్ ఈస్ట్ వార్ ఉద్రిక్తల నేపథ్యంలో ఇన్వెస్టర్లు భయాందోళనకు గురై బిట్‌కాయిన్ వంటి రిస్క్ ఎక్కువగా ఉండే ఆస్తులను విక్రయించి, సురక్షితమైన బంగారం వంటి వాటిపై పెట్టుబడులు పెడుతున్నారు. రెండవది మార్చి 27న ముగిసిన సుమారు 14 బిలియన్ల డాలర్ల విలువైన ఆప్షన్స్ ఎక్స్‌పైరీ. ఈ భారీ ఎక్స్‌పైరీ కారణంగా ట్రేడర్లు తమ పొజిషన్లను క్లోజ్ చేయడం వల్ల మార్కెట్‌లో విపరీతమైన అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. ఇక మూడవది అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఈవట) సమావేశం తర్వాత వడ్డీ

రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలతో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ బలపడి, క్రిప్టో మార్కెట్ మొత్తం రెడ్ మార్క్‌లో ట్రేడ్ అవుతోంది. దీంతో రానున్న రోజుల్లో బిట్‌కాయిన్ గమనం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న 66,000 డాలర్ల వద్దనే నిలబడితే, మార్కెట్ తిరిగి పుంజుకుని 68,000 నుంచి 70,000 డాలర్లకు చేరే అవకాశం ఉంది. కానీ, ఒకవేళ ఈ సపోర్ట్ బ్రేక్ అయితే మాత్రం, ధర నేరుగా 60,000 డాలర్లకు పడిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా ఎథరియం, సొలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు కూడా 3 నుండి 5 శాతం మేర నష్టపోవడం వల్ల మార్కెట్ అంతా అనిశ్చితిలో ఉంది. ఇరాన్ చర్చల ఫలితాలు, పెరుగుతున్న చమురు ధరలు, ఫెడ్ తీసుకునే తదుపరి నిర్ణయాల బట్టి బిట్‌కాయిన్ ధరల్లో త్వరలోనే పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది.

# పెట్రోల్ బంకుల ద్వారా కిరోసిన్ పంపిణీ



మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాల వల్ల భారతదేశానికి అందాల్సిన ఒఖఉ దిగుమతులు దాదాపు 50 శాతం మేర పడిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశీయంగా వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా పెట్రోలియం భద్రతా మరియు లైసెన్సింగ్ నిబంధనలను తాత్కాలికంగా సడలిస్తూ కేంద్రం ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా గతంలో నిలిపివేసిన పి.డి.ఎస్ (ఖఆూ) కిరోసిన్ పంపిణీని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా, దానిని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల ద్వారా కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ప్రకారం.. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి 21 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ సడలింపులు వర్తిస్తాయి. సాధారణంగా రేషన్ షాపులకే పరిమితమయ్యే కిరోసిన్, ఇప్పుడు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో కూడా లభ్యం కానుంది. గ్యాస్ సిలిండర్ల కొరత భయాల నేపథ్యంలో తక్కువ ఆదాయ వర్గాలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కిరోసిన్‌ను ఒక ప్రత్యామ్నాయ ఇంధనంగా అందుబాటులో ఉంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ తాత్కాలిక ఏర్పాటు సుమారు 60 రోజుల పాటు అమలులో ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించింది. గృహ అవసరాలకు కిరోసిన్‌ను వాడుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా వంటింట్లో గ్యాస్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే కాలుష్య కారకమైన కిరోసిన్ వాడకాన్ని తగ్గించి, పైప్డ్ నేచురల్ గ్యాస్(ఖఔఉ) వైపు ప్రజలను మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో సామాన్యులను ఆదుకోవడమే ప్రధమ కర్తవ్యంగా ప్రభుతం ఈ చర్యలు చేపట్టింది.


# కంపెనీలూ చర్యలు చేపట్టాలి



పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశీయంగా తలెత్తిన అంతరాయాలను చక్కదిద్దేందుకు, మన ప్రభుత్వం వేగంగా ప్రతిస్పందించి నందుకు భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆదివారం కృతజ్ఞతలు తెలిపింది. సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా చూడటం, ఎగుమతిదార్లకు మద్దతు ఇవ్వడం, కుటుంబాలను కాపాడటం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని రక్షించడంపై ప్రభుత్వం సారించిందని వివరించారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించడానికి, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగడానికి, ఉద్యోగాల రక్షణకు, జీవనోపాధికి ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ చర్యలకు తోడు, దేశీయ కంపెనీలు కూడా తగిన విధంగా స్పందించాలని 12 సూత్రాలను సీఐఐ తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం-పరిశ్రమల మధ్య నిరంతర సమన్వయం అవసరమని

సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అయితే సరఫరా వైపు అంతరాయం ఉందని.. ఇంధన - రవాణా వ్యయాలు పెరగడం, వర్కింగ్ క్యాపిటల్‌లో ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు సీఐఐ గమనించిందని బెనర్జీ వెల్లడించారు. పరిశ్రమల నిర్వాహకులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీఐఐ సూచించింది..

## రేమండ్ మాజీ చైర్మన్ కన్నుమూత



ప్రముఖ పారిశ్రామికవేత్త, రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్ విజయ్‌పథ్ సింఘానియా కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. భారతీయ టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలోనూ, రేమండ్ బ్రాండ్‌ను "ద కంప్లీట్ మ్యాన్" అనే నినాదంతో ప్రతి ఇంటికి చేరువ చేసిన ఘనత ఆయనదే కావడం విశేషం. విజయ్‌పథ్ సింఘానియా సారథ్యంలో రేమండ్ గ్రూప్ కేవలం ఒక బట్టల మిల్లు స్థాయి నుండి అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌గా ఎదిగింది. నాణ్యత, లేటెస్ట్ ట్రెండ్స్ విషయంలో ఇండియన్ మెన్ ఫ్యాషన్ రంగంలో సింఘానియా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, విదేశీ మార్కెట్లలో కూడా భారతీయ వస్త్రాలకు గుర్తింపు తెచ్చారు. ఆయన వ్యాపార దక్షతకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. వ్యాపారంతో ఆయన ఎవరూ చేయని సాహసాలు కూడా చేసారు. 1988లో లండన్ నుండి ఢిల్లీ వరకు మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఒంటరిగా ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే, 2005లో 67 ఏళ్ల వయసులో హాట్ ఎయిర్ బెలూన్‌లో అత్యధిక ఎత్తుకు (సుమారు 69,000 అడుగులు) ప్రయాణించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ముంబై నగరానికి గౌరవ షెరీఫ్‌గా కూడా ఆయన సేవలందించారు. అయితే వ్యాపారరంగంలో అగ్రస్థానానికి ఎదిగిన సింఘానియా చివరి రోజులు విషాదకరంగా సాగాయి. తన కుమారుడు గౌతమ్ సింఘానియాతో ఏర్పడిన ఆస్తి తగాదాలు, కోర్టు వివాదాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. తన ఆస్తి మొత్తాన్ని కుమారుడికి రాసిచ్చిన తర్వాత, ఉండటానికి ఇల్లు కూడా లేకుండా అద్దె ఇంట్లో ఉండాల్సి వచ్చిందని ఆయన రాసిన "ఃని ఎనిఇనీఎజూశ్రీవబివ ఒతిటవ" ఆత్మకథలో ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రీకొడుకుల మధ్య సాగిన ఈ న్యాయపోరాటం కార్పొరేట్ ప్రపంచంలో ఒక హెచ్చరికగా మిగిలిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. విజయ్‌పథ్ సింఘానియా మృతి పట్ల పారిశ్రామిక, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



గ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ఉద్రిక్తతల(ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(ఒఖఉ) సిలిండర్ ధరలను పెంచాయి. ఈ తరుణంలో ఇంట్లో ఉపయోగించే సాధారణ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 60 పెరిగింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది. హోటల్స్, రెస్టారెంట్లు వాడే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 115 పెరిగింది. దీంతో కొన్ని హోటల్స్ మూసి వేసుకునే పరిస్థితి నెలకొంది. ఇతర నగరాలతో పోల్చి చూస్తే వరంగల్‌లోనే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రోజు(మార్చి 30) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగారల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

## సెయిల్ నూతన సీఎండీగా అశోక్ కుమార్ పాండా



ప్రభుత్వ రంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నూతన చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అశోక్ కుమార్ పాండాను పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ సిఫారసు చేసింది. ప్రస్తుతం సెయిల్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పాండాకు ఈ సంస్థలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ పూర్తి చేసి మేనేజ్‌మెంట్ ట్రయినీగా సెయిల్‌లో కెరీర్ ప్రారంభించిన ఆయన బిజినెస్ ఫైనాన్స్‌లో పిహెచ్‌డి కూడా పొందారు. గతంలో ఆయన డైరెక్టర్ (కమర్షియల్)గా అదనపు బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించారు. సెయిల్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో అశోక్ కుమార్ పాండా కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా డీలెవరేజింగ్ ప్రయత్నాల ద్వారా సంస్థ అప్పులను ఏకంగా రూ. 20,000 కోట్ల మేర తగ్గించిన ఘనత ఆయనకు దక్కుతుంది.

## సూర్యవంశీ వీరబాదుడు... సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యవంశీ ఆడిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

ఛేజింగ్ లో రాజస్థాన్‌కు, చెన్నై బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టంగా అనిపించలేదు. ముఖ్యంగా ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. క్రీజులోకి వచ్చిన కాసేపటికే బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 17 బంతుల్లోనే 305.88 స్ట్రైక్ రేట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసి చెన్నై శిబిరాన్ని నిరాశకు గురిచేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 74 పరుగులకు చేరిందంటే వైభవ్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలి వికెట్‌కు యశస్వి జైస్వాల్‌తో కలిసి కేవలం 38 బంతుల్లోనే 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. సూర్యవంశీ ఔటైన తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (18; 9 బంతుల్లో) కూడా వేగంగా ఆడాడు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ (38 నాటౌట్; 36 బంతుల్లో) నిలకడగా ఆడి, కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

అంతకుముందు, రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడకుండా 19.4 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. సంజూ శాంసన్ (6), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6) సహా టాపార్డర్ పూర్తిగా విఫలమైంది.

ఒక దశలో 57 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నంద్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు పడగొట్టి చెన్నై పతనాన్ని శాసించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాజస్థాన్ ఈ సీజన్‌లో తమ జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది.

## రోహిత్ 2.0 రెడీ.. ప్రత్యర్థి జాగ్రత్తగా ఉండాల్సిందే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ని రోహిత్ శర్మ సూపర్ స్టార్ట్ చేశాడు. 200ం స్ట్రైక్ రేట్ తో హాఫ్ సెంచరీ చేసిన అతడిపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. కేవలం 38 బంతుల్లోనే 78 రన్స్ చేసిన ముంబై జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్ లోని మిగతా టీమ్స్ కి హెచ్చరించాడు. రోహిత్ 2.0 రెడీ అయింది.. ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ చేశాడు. కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూసిన తర్వాత ఒకటే చెబుదామని ఉందా అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపినట్లుగా అనిపిస్తోంది.. అత్యుత్తమ ఫామ్ లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేసేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని లాంటి బౌలింగ్ లో ఈజీగా సిక్సులు కొట్టేశాడు. స్వల్ప విరామం తర్వాత స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజుల సమయం పడుతుంది. కానీ, రోహిత్ పై ఆ ప్రభావం ఏమీ కనిపించలేదని కుంబ్లే వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం.. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయడం అందర్నీ షాక్ కి గురి చేసింది. రోహిత్-- ర్యాన్ -రికెల్టన్ దెబ్బకి పవర్ ప్లేలోనే అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం తీవ్ర నిరుత్సాహ పరిచింది. సునీల్ నరైన్ బౌలింగ్ కి వచ్చే సమయానికి జరగాల్సిన పూర్తి నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను పూర్తిగా దెబ్బ తీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా ఉపయోగించుకోవాలని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్‌కి బ్యాడ్‌న్యూస్.. ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసిన జియో





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ వేళ బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్ కి షాకిచ్చింది. భారత్ కి చెందిన జియోస్టార్ బంగ్లాలో ఐపీఎల్ ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐపీఎల్ ప్రసారాలపై గతంలో విధించిన నిషేధంపై పునరాలోచిస్తున్నట్లు అక్కడి సర్కార్ చెప్పిన తర్వాత ఈ పరిణామం జరగడం గమనార్హం. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని టీస్పోర్ట్స్ (బంగ్లాదేశ్ బ్రాడ్కాస్టర్)కు జియోస్టార్ రాసిన లేఖ ఆధారంగా ఇంటర్నేషనల్ మీడియా కథనాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం భాగస్వామ్య పక్షం గడువులోగా చెల్లింపులు చేయడంలో ప్రతిసారి ఫెయిల్ కావడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఉన్న సమయంలో హిందూ మైనార్టీలపై జరిగిన దాడులు జరిగాయి. అలాంటి సమయంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను మినీ వేలంలో కేకేఆర్ రూ.9.20కోట్లకు సొంతం చేసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం బంగ్లాదేశ్ సర్కార్.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బంగ్లాలో కొత్తగా ఏర్పడిన సర్కార్ ఆ నిషేధంపై పునరాలోచిస్తామని సంకేతాలు ఇచ్చేసింది. ఇంతలోనే జియో డీల్ నుంచి బయటకు వచ్చేందుకు రెడీ అయింది. ఇందుకు భాగస్వాముల మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని సమాచారం. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ గా పేరుగాంచిన ఐపీఎల్ ను ఢాకా ఫ్యాన్స్ బాగా ఆదరిస్తారు. తాజా నిర్ణయం వ్యూయర్షిప్, ఫ్యాన్ ఎంగేజ్మెంట్ పై తీవ్ర ప్రభావం చూపించనుంది. కాగా, జియో నిర్ణయంతో ఐపీఎల్ ప్రసారాల కోసం 2027 వరకు టీస్పోర్ట్స్ కి ఉన్న పర్మిషన్స్ రద్దు అయ్యాయి.

## బైకర్ కోసం రోజుకి 32 కి.మీ.. శర్వా డెడికేషన్ కు హ్యాట్సాఫ్!

బైకర్ కోసం శర్వానంద్ చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాజాగా విడుదలైన ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ మార్పు వెనుక ఉన్న కఠినమైన ప్రయాణాన్ని స్పష్టంగా అందరికీ తెలిసేలా చేసింది. ఈ సినిమాలో బైకర్ పాత్రను రియలిస్టిక్‌గా చూపించాలన్న లక్ష్యంతో శర్వా పూర్తిగా తన శరీరాన్ని మలచుకున్నారు. ట్రైనింగ్ లో భాగంగా శర్వా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తడం లాంటి ఎక్స్‌ట్రీమ్ కార్డియో వర్కౌట్స్ చేయడమనేది మామూలు విషయం కాదు. క్రమశిక్షణతో చేసిన ఈ ప్రయాణంలో ఆయన 6 నుంచి 8 కిలోల వరకు బరువు తగ్గి, లీన్ మరియు యూత్‌ఫుల్ ఫిజిక్‌ను సాధించారు. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కేవలం లుక్ కోసమే కాకుండా, పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో జరిగిందిగా కనిపిస్తోంది. అయితే, ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం డెడికేషన్‌దే. కఠినమైన వర్కౌట్స్, నిరంతర శ్రమ, మానసిక ఒత్తిడి.. వీటన్నింటినీ ఎదుర్కొంటూ శర్వా తన టార్గెట్ ను సాధించారు. ఈ ప్రయాణాన్ని ఆయన స్వయంగా ఎగ్జాస్టింగ్, పెయిన్‌ఫుల్, రిలెంట్‌లెస్ గా అభివర్ణించడం, ఈ ప్రిపరేషన్ ఎంత తీవ్రంగా సాగిందో చెబుతోంది. ఫిజికల్‌గా మాత్రమే కాదు, మెంటల్‌గా కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒక పెద్ద ఛాలెంజ్‌గా నిలిచింది. ఫిట్‌నెస్ పరంగా చూస్తే, ఆయన రొటీన్ చాలా కఠినంగా ఉంది. జిమ్‌లో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటూ స్ట్రెచింగ్, బ్రీత్‌వర్క్‌లను కూడా పాటించారు. ముఖ్యంగా యోగా ఆయనకు మానసిక ప్రశాంతత ఇచ్చిన కీలక అంశంగా మారింది. కఠినమైన ట్రైనింగ్ వల్ల వచ్చే మెంటల్ స్ట్రెయిన్‌ను తగ్గించడంలో యోగా ముఖ్య పాత్ర పోషించిందని ఆయన చెప్పడం, ఫిట్‌నెస్‌లో మైండ్- బాడీ బ్యాలెన్స్ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. బిహైండ్ ది సీన్స్ యాంగిల్ లో చూస్తే, ఈ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రిపరేషన్ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోలో కనిపించిన ట్రైనింగ్ సెషన్స్, బైక్ రైడింగ్ ప్రాక్టీస్ ఇవన్నీ చూస్తుంటే శర్వా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారనేది తెలుస్తోంది. సినిమాలో ఉపయోగించే బైక్స్‌ను నడిపేందుకు స్పెషల్ గా ట్రైనింగ్ తీసుకోవడం ద్వారా, ఆయన పాత్రను మరింత సహజంగా తీర్చిదిద్దారు. ఇది కేవలం ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రమే కాకుండా ఒక యాక్టర్ కమిట్‌మెంట్ కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని శర్వా చూపించారు. కాగా బైకర్ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుండగా, ఇప్పటికే ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. మరి శర్వా ఈ సినిమా కోసం పడ్డ కష్టం ఏ మేరకు ఫలిస్తుందనేది చూడాలి.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది





జెన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965